# తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 255 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | ఆదివారం, ఆగస్టు 02, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-


### ఎయిర్ పోర్టులో వీడియో వాల్ ను పరిశీలించిన ప్రధాని మోడీ

భోగాపురం : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ టెర్మినల్ భవనంలో ఏర్పాటు చేసిన అతిపెద్ద వీడియో వాల్ ను ప్రధాని మోదీ పరిశీలించారు. వీడియో వాల్లో ప్రదర్శించిన వివిధ పుణ్యక్షేత్రాలు, ఆంధ్రప్రదేశ్, ఉత్తరాంధ్ర చారిత్రాక అంశాలను ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. విమానాశ్రయ ప్రాంగణంలోని వివిధ కళాకృతులను ప్రధాని ఆసక్తిగా పరిశీలించారు.
టెర్మినల్ ప్రాంగణంలో ప్రధాని మోదీతో గవర్నర్, సీఎం, డెప్యూటీ సీఎం, సీఎంఆర్ ప్రతినిధులు ఫోటోలు దిగారు. ఓపెన్ టాప్ జీపులో వెళ్తూ 13,500 మంది గిరిజన మహిళల థింసా నృత్యాన్ని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తదితరులు వీక్షించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ : గౌరవెల్లి ప్రాజెక్టుతో పాటు పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు గతంలో మంజూరైన పర్యావరణ అనుమతులను కొనసాగిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం తో సంప్రదింపులు జరుపుతూ, అభిషేక్ సింగ్వి లాంటి మంచి న్యాయవాదులను నియమించి సుప్రీంకోర్టు లో న్యాయపరంగా సమర్థవంతంగా పోరాడిన ఫలితంగానే ఈ తీర్పు వచ్చిందన్నారు. గౌరవెల్లి, పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు ఈ తీర్పు కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరనున్నాయని, రైతులకు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇవి ఎంతో దోహదపడతాయని మంత్రి తెలిపారు. తెలంగాణ హక్కులను పరిరక్షించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చొరవ, ప్రభుత్వం చేసిన న్యాయపోరాటం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు

# యాంటి పేపర్ లీక్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం



న్యూఢిల్లీ, యాంటి పేపర్ లీక్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదందేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలు, ప్రవేశ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకులు, మాస్ కాపీయింగ్, ఇతర అక్రమాలను అరికట్టే లక్ష్యంతో రూపొందించిన యాంటి పేపర్ లీక్ బిల్లు 2026కు రాష్ట్రపతి ఆమోదం లభించింది. దీంతో ఈ బిల్లు చట్ట రూపం దాల్చింది. కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ చట్టం ప్రకారం ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల్లో మోసాలు, అక్రమాలకు పాల్పడిన వారికి జైలు శిక్షతో పాటు భారీ జరిమానాలు కూడా విధించనున్నారు.

# కరీంనగర్ లో గల్లీగల్లీని అభివృద్ధి చేస్తా:

## కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి



వెళ్లిన కేంద్ర మంత్రి బండి సంజయ్ అంబేద్కర్ భవన్ సమీపంలో నిర్వహించిన 'వన మహోత్సవం-2026 లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు అధికారులతోపాటు మహిళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి స్వయంగా మొక్కలను నాటారు. మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, అధికారులు సైతం మొక్కలు నాటారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ లోని ప్రతి గల్లీగల్లీని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ముఖ్యంగా అభివృద్ధికి అంతగా నోచుకోని నగర శివారు గ్రామాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అందుకోసం కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తాం. ఇప్పటికే స్మార్ట్ సిటీ కింద 900 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దినం. ఇవిగాకుండా అమ్రుత్ 1, 2 కింద 279 కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. అట్లాగే అర్బన్ డెవలెప్ మెంట్ ఫండ్ కింద రూ. 50 కోట్లు వచ్చినయ్. వాటితో గల్లీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినం. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్రమే పూర్తిగా 156 కోట్లను మంజూరు చేసింది. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. తాజాగా 840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయి. కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మిస్తాం. స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తాం, నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ మోటార్, ఇంధనం ఉ పయోగించే రవాణా వాహనాలు వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తాం. కరీంనగర్ శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అభివృద్ధిలో తెలంగాణలోనే కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు సుందర నగరంగా మార్చబోతున్నాం. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తనకు ఓట్లేసి గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు శాయశక్తులా క్రుషి చేస్తున్నా. అందుకోసం నా పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే రూ. 22 వేల కోట్లు నిధులు ఖర్చు పెట్టిన. పలు అభివృద్ధి పనులు చేసిన. త్వరలోనే వివిధ కేంద్ర పథకాల కింద మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నా.

కరీంనగర్ : కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని గల్లీగల్లీని అభివృద్ధి చేస్తానని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తానని స్పష్టం చేశారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పరామర్శలతో బిజీబిజీగా గడిపారు. ఉదయం 9 గంటలకు తన నివాసం వద్దకు వచ్చిన సందర్శకులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్న బండి సంజయ్ ఆ తరువాత 10.30 గంటలకు స్థానిక కార్పొరేటర్లు, బీజేపీ నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తొలుత 48వ డివిజన్ లోని విద్యానగర్ కురుమవాడలో కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తోపాటు స్థానిక కార్పొరేటర్ కర్ర పద్మ అనిల్ తో కలిసి కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ నిధుల్లో రూ. 80 లక్షలు యూఐడీఎఫ్ నిధులు కాగా, మిగిలిన రూ. 20 లక్షలు మున్సిపల్ సాధారణ ఫండ్ కు సంబంధించినవి. అనంతరం 19వ డివిజన్ లోని రేకుర్తి ముదిరాజ్ కాలనీకి వెళ్లిన కేంద్ర మంత్రి రూ. 40 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అట్లాగే లక్ష్మీ నరసింహ కాలనీలో రూ. 57 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడి నుండి మొగ్దుంపూర్ వెళ్లిన కేంద్ర మంత్రి రూ. 10 లక్షల జాతీయ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మహిళాశక్తి ధరణి గ్రామైఖ్య సంఘ భవనాన్ని స్థానిక సర్పంచ్ శివకుమార్ తో కలిసి ప్రారంభించారు.

అట్లాగే రూ. 15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్ ను ప్రారంభించారు. అంతకుముందు చింతకుంట

# ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



రంగారెడ్డి: చేవెళ్ల:తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తల్లి రుక్మమ్మ మృతి పట్ల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి నివాసానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వచ్చి రుక్మమ్మ చిత్రపటానికి పువ్వులతో నివాళులర్పించారు. అనంతరం పట్నం మహేందర్ రెడ్డి మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. రుక్మమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లు మరియు రైతులు భూ సమస్యలు మరియు రైతుల సమస్యలకు సంబంధించిన విషయాలను మంత్రికి వివరించారు. వెంటనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించాడు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైంది: మంత్రి తుమ్మల



హైదరాబాద్: తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీఎం నిర్ణయాలకు అనుగుణంగా నియామకాలు జరుగుతాయన్నారు. ఆశావహులు తమ పేర్లను పీసీసీకి పంపాలని సూచించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకాలు త్వరలో చేపడతామన్నారు. వివిధ నామినేటెడ్ పోస్టుల భర్తీని దశలవారీగా పూర్తి చేస్తామని, సహకార సంఘాల పాలకవర్గాల పోస్టులను కూడా భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి రన్ వే



విజయనగరం, ఆగస్టు 1, (న్యూస్ పల్స్): పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా' ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా అభినందించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త 'రన్‌వే'గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక 'లాంచ్‌ప్యాడ్' అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. "అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం" అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

భోగాపురం ఎయిర్‌పోర్టును ఉత్తరాంధ్రకు మణిహారం= చంద్రబాబు

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో 'అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం' ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. "రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం" అని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ. 6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ. 2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

చేసే పనితోనే సమాధానం

ఉత్తరాంధ్రలో ప్రగతి పరుగులు పెడుతోందని వ్యాఖ్య

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం జాతికి అంకితమైన చారిత్రాత్మక ఘట్టంతో ఇప్పుడు ప్రపంచం మొత్తం ఉత్తరాంధ్ర వైపు చూస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. విమానాశ్రయ ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్షాల హేళనలకు తమ అభివృద్ధి పనులతోనే సమాధానమిచ్చామని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం ఒక బలమైన సింహద్వారంలా నిలుస్తుందని, దీని ద్వారా రాబోయే రోజుల్లో వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. "ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని కేవలం ఎర్రబస్సులు మాత్రమే తిరిగే వెనుకబడిన ప్రాంతం అని కొందరు అవహేళన చేశారు.

తెలంగాణ పవర్

# సంపాదకీయం

ఆదివారం, ఆగస్టు 02, 2026

## సీజేపీ సైలెంట్ ఉద్యమం

నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలోని లోపాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నడిపిన ఉద్యమం ఇటీవల దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమం పైకి ఆగినట్లు కనిపించినా, విశ్లేషకులు దీన్ని కేవలం తాత్కాలిక ఎత్తుగడగా చూస్తున్నారు. సీజేపీ ఇప్పుడు వ్యవస్థలో నిలబడి, ఎన్నికల్లో పోటీ చేసి, బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత కూటమి నిర్మించాలని ప్రయత్నిస్తోందని తెలుస్తోంది.విద్యార్థుల నిరసనలు మంత్రి రాజీనామాకు దారితీశాయి. ఇది ఉద్యమకారులకు తక్షణ విజయంగా కనిపించినా, సీజేపీకి అసలు లక్ష్యం అంతకు మించినదని స్పష్టమవుతోంది. రాజీనామా తర్వాత ప్రధాన ఇష్యూ కనుమరుగైంది. విద్యార్థులపై అనేక కేసులు నమోదయ్యాయి. దాడులు, రాళ్లు విసిరినవారిని గుర్తించడంతో పలువురు మళ్లీ ఉద్యమానికి రావడం కష్టమైంది. ఫలితంగా బహిరంగ నిరసనలు ఆగిపోయాయి. అయినా సీజేపీ సీనియర్ కార్యకర్తల కార్యకలాపాలు ఆగలేదు. వారు వివిధ వ్యక్తులను కలుస్తూ, వ్యూహాలు రూపొందిస్తున్నారు.సీజేపీలో అశుతోష్ రాంకా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆప్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న ఈయన ఇప్పుడు సీజేపీలో ప్రముఖంగా కనిపిస్తున్నారు. దీపికా బలీయ కూడా ముందుకు వచ్చారు. జాట్ సమాజానికి చెందిన ఈ మహిళా నేత ఇటీవల సంయుక్త కిసాన్ మోర్చా సమావేశానికి హాజరై కేంద్ర వ్యతిరేక స్వరం వినిపించారు. అక్కడే రైతు నేత రాకేశ్ టికాయత్‌ను కలిశారు. 2020?21 రైతు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన టికాయత్‌తో సంపర్కాలు సీజేపీకి రైతు శక్తిని చేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాయి. అంతకుముందు సమాజ్‌వాదీ పార్టీ నేతలు, ఆజాద్ సమాజ్ పార్టీ, ఆప్ నాయకులతోనూ చర్చలు జరిగాయి. యాంటీ బీజేపీ కూటమిని ఏర్పాటు చేసి ఏకీకృత పోరాటం చేయాలనే లక్ష్యంతో ఈ భేటీలు సాగుతున్నాయి. రాకేశ్ టికాయత్‌కు ఉత్తరప్రదేశ్ జాట్ సమాజంలో పట్టు ఉంది. అజీత్‌సింగ్, హరియాణాలోని ఓం ప్రకాశ్ చౌతాల కుటుంబం వంటి జాట్ నాయకులతో కలిసి కూటమి ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జాట్ ఓట్లను బీజేపీ నుంచి దూరం చేయడమే లక్ష్యం. 2021?22 రైతు ఉద్యమంలో ఢిల్లీకి వచ్చే రోడ్లు దిగ్బంధించిన అనుభవాన్ని సీజేపీ ఉపయోగించుకోవాలని చూస్తోంది. అప్పటి సంఘటనల్లో ఎర్రకోట వద్ద జరిగిన కొన్ని సంఘటనలు, ఒక ఉద్యమకారుడి మరణం వంటివి ఇప్పటికీ చర్చనీయాంశాలే. అయితే ప్రస్తుతం సీజేపీ మరింత విస్తృత బేస్ నిర్మించడంపై దృష్టి సారించింది. విద్యార్థుల్లోని యాంటీ మోదీ సెంటిమెంట్‌ను రైతు సంఘాలు, విపక్షాలతో కలిపి యూపీ, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీని సవాలు చేయాలని భావిస్తోంది. ప్రాంతీయ పార్టీలకు లబ్ధి చేకూర్చే వ్యూహాలు రూపొందుతున్నాయి. కాంగ్రెస్ కూడా సీజేపీతో సఖ్యతగా వ్యవహరిస్తూ ప్రోత్సహిస్తోంది.మంత్రి రాజీనామాతో సీజేపీకి స్పష్టమైన విజయంగా చెప్పుకునే అవకాశం తగ్గింది. విద్యార్థుల ఉద్యమం ఆగిపోవడం, కేసులు నమోదు కావడం పెద్ద సవాళ్లు. అయినా సైలెంట్‌గా సాగుతున్న ప్రయత్నాలు, కీలక నేతల సంపర్కాలు చూస్తే ఉద్యమం పూర్తిగా ఆగిపోలేదని స్పష్టం. కొంతమంది జంతర్‌మంతర్ ఉద్యమం వద్ద రీల్స్ చేయడం ద్వారా ఫాలోవర్ల సంఖ్య పెంచుకున్నారు. ఓ మైనర్‌కు ఇన్‌స్టాలో మొదట 5 వేల మంది ఫాలోవర్లు ఉండేవారట. జంతర్‌మంతర్ వద్ద రీల్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో అతని ఫాలోవర్లు 7.5 లక్షలకు పెరిగారట. ఫాలోవర్ల పెరుగుదలతో కొందరు కొత్త ఫోన్ కొనుక్కుని అక్కడే విజయం సాధించానని చెప్పుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఉద్యమం కంటే వ్యక్తిగత ప్రచారం, కంటెంట్ సృష్టి మీద దృష్టి పెట్టినట్లు అనిపిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు యువతను ఆకర్షించి, వారిని వేదిక వద్దకు తీసుకువచ్చే శక్తిగా మారాయి.కొంతమంది దూషించి, ద్వేషపూరిత వ్యాఖ్యలతో రీల్స్ చేసి ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. అయినా కొందరు లబ్ధి పొందినట్లు కనిపిస్తోంది. ఇలాంటి విధానం ఉద్యమం యొక్క అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది. సానుకూలంగా, నిజమైన సమస్యలపై అవగాహన కల్పించే రీల్స్ చేస్తే మంచిదికానీ, ద్వేషం, తిట్లు ద్వారా దృష్టి సాధించే ప్రయత్నాలు ప్రజా మద్దతును బలహీనపరుస్తాయి.తాజా జంతర్‌మంతర్ రీల్స్ ఇన్‌స్టా బేస్డ్ హెజిటేషన్ అనే ధోరణిని సూచిస్తున్నాయి. అంటే సామాజిక మాధ్యమాల్లో కనిపించే విధంగా, లైక్‌లు, ఫాలోవర్లు పెరగాలనే ఆలోచనతోనే చాలామంది పాల్గొంటున్నారు. నిజమైన సమస్యలపై పోరాటం కంటే వైరల్ కంటెంట్ సృష్టి ప్రధానమైపోతే ఉద్యమం బలహీనపడుతుంది. అదే సమయంలో సామాజిక మాధ్యమాలు సమాచారం వ్యాప్తి చేయడంలో, యువతను సమీకరించడంలో సహాయపడతాయిజంతర్‌మంతర్ వద్ద జరిగిన ఈ ఉద్యమంలో రీల్స్ పాత్ర కీలకంగా కనిపిస్తోంది. సామాజిక మాధ్యమాలు ఆధునిక ప్రజా ఉద్యమాల ఆకారం మార్చేస్తున్నాయి. అయితే వాటిని సానుకూలంగా, నిజాయితీగా ఉపయోగిస్తేనే అసలు లక్ష్యాలు నెరవేరుతాయి.రాజకీయాల్లో బలమైన శక్తిగా మారాలనే లక్ష్యంతో సీజేపీ కదులుతోంది. ఈ ప్రయత్నాలు ఎంతవరకు విజయవంతం అవుతాయో, యాంటీ బీజేపీ ఫ్రంట్ ఎలా రూపుదిద్దుకుంటుందో రాబోయే నెలల్లోనే స్పష్టమవుతుంది.


**- ఎడిటర్**

# మూడు హృదయాలు ముప్పై ఏళ్ల అనుబంధం

**కాలం మారినా తగ్గని బంధ? తరాలకు ఆదర్శంగా నిలిచిన ముగ్గురు మిత్రులు..**
**బోధన్ క్యాంపస్‌లో మొలిచిన స్నేహం...**
**ఎనిమిది కార్పొరేట్ ఆసుపత్రులుగా విస్తరించిన మానవతా యాత్ర.**
**తాళ్ల సుమన్ గౌడ్, మహమ్మద్ అసద్ ఖాన్, తూర్పు వివేకానంద రెడ్డి.ఒకే బెంచ్‌పై మొదలైన బంధం..**
**లక్షల కుటుంబాలకు ఆరోగ్య భరోసాగా మారిన కథ.**



నిజామాబాద్ ,ఆగస్టు 01: బోధన్ పట్టణంలోని ఆర్కే ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లో 2002లో మొదలైన ఒక సాధారణ పరిచయం, కాలక్రమంలో వేలాది కుటుంబాల జీవితాల్లో ఆశను నింపే ఆరోగ్య ఉద్యమంగా మారుతుందని అప్పట్లో ఎవ్వరూ ఊహించలేదు. ఒకే తరగతి, ఒకే బెంచ్, ఒకే కలలు?అలా మొదలైన ముగ్గురు యువకుల స్నేహం నేడు తెలంగాణలో ఎనిమిది కార్పొరేట్ ఆసుపత్రుల రూపంలో మానవతా సేవగా వికసించింది.ఆ ముగ్గురు స్నేహితులే తాళ్ల సుమన్ గౌడ్, మహమ్మద్ అసద్ ఖాన్, తూర్పు వివేకానంద రెడ్డి.విద్యార్థి దశ ముగిసింది. ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలు?జీవితాలు ఒక్కొక్క దిశలో సాగిపోయాయి. కానీ వారి స్నేహం మాత్రం దూరాలను లెక్క చేయలేదు. కాలం వారిని విడదీయలేకపోయింది; ఆ బంధం మరింత బలపడింది. ఆ బలమైన స్నేహమే తరువాత ఒక సామాజిక సంకల్పానికి రూపం ఇచ్చింది.ఒక ప్రశ్న... ఒక సంకల్పంసమాజంలో పేదలు, మధ్యతరగతి కుటుంబాలు వైద్య ఖర్చుల భారంతో పడుతున్న కష్టాలను వారు దగ్గరగా గమనించారు. డబ్బు లేకపోవడం వల్ల చికిత్సకు దూరమవుతున్న కుటుంబాల బాధ వారిని కలచివేసింది.“డబ్బు లేని కారణంగా ఎవ్వరూ వైద్యం కోల్పోకూడదు” అనే ఒక్క లక్ష్యం వారి జీవితాలను కొత్త దిశలో నడిపించింది.ఆ ఆలోచనకు రూపమే వెల్నెన్ హాస్పిటల్స్.అమీర్‌పేట్‌లో మొదలై తెలంగాణ అంతటా విస్తరించిన సేవహైదరాబాద్ అమీర్‌పేట్ డీకే రోడ్డులో మొదటి వెల్నెస్ హాస్పిటల్ ప్రారంభమైంది. కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను సామాన్యులకు అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఆ ఆసుపత్రి, కొద్దికాలంలోనే ప్రజల విశ్వాసాన్ని సంపాదించింది.ఆ తర్వాత సేవా ప్రయాణం వేగం అందుకుంది.– అమీర్‌పేట్ ? డీకే రోడ్– అమీర్‌పేట్ ? లాల్ బంగ్లా– బి.ఎన్. రెడ్డి నగర్– శ్యామ్ కారం రోడ్, అమీర్‌పేట్– నంగారెడ్డి– కొంపల్లి– నిజామాబాద్– బేగంపేట్‌నేడు తెలంగాణలో ఎనిమిది వెల్నెన్ హాస్పిటల్ బ్రాంచ్‌లు విజయవంతంగా సేవలందిస్తున్నాయి.వ్యాపారం కాదు... మానవతా సేవవెల్నెస్ హాస్పిటల్స్ ప్రత్యేకత కేవలం ఆసుపత్రుల సంఖ్యలో లేదు. పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అత్యల్prప ధరల్లో అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఫ్యామిలీ హెల్త్ కార్డ్ కార్యక్రమం వేలాది కుటుంబాలకు ఆరోగ్య భరోసాగా మారింది.ఈ కార్డు ద్వారా రాయితీతో వైద్యసేవలు, మందులు, పరీక్షలు, ఇన్‌పేషెంట్ సదుపాయాలు, అత్యవసర సేవలు వంటి అనేక ప్రయోజనాలు అందుతున్నాయి. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లాలో లక్ష మందికి పైగా ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు సంస్థ వర్గాలు చెబుతున్నాయి.స్నేహం నుంచి సేవ... సేవ నుంచి సంస్థఒకే బెంచ్‌పై కూర్చొని కలలు కనిన ముగ్గురు స్నేహితులు, నేడు వేలాది మంది రోగులకు నాణ్యమైన వైద్యం అందించే సంస్థను నిర్మించారు. వ్యాపార విస్తరణ కంటే మానవతా సేవకు ప్రాధాన్యం ఇవ్వడం వారి ప్రయాణాన్ని ప్రత్యేకంగా నిలబెట్టింది.త్వరలోనే నిజామాబాద్ జిల్లాలో వెల్నెస్ నర్సింగ్ కాలేజ్, అలాగే వరంగల్ మరియు దక్షిణ భారతంలోని ఇతర ప్రాంతాలకు వెల్నెస్ హాస్పిటల్ సేవలను విస్తరించే ప్రణాళికలు కూడా కొనసాగుతున్నాయి.స్నేహితుల దినోత్సవానికి స్ఫూర్తిఈ ముగ్గురు మిత్రుల కథ కేవలం విజయగాథ కాదు. ఇది స్నేహం, నమ్మకం, సేవాభావం, సామాజిక బాధ్యత కలిసి సృష్టించిన అరుదైన గాథ.బోధన్ కళాశాల క్యాంపస్‌లో మొదలైన ఆ బంధం, నేడు వేలాది కుటుంబాల జీవితాల్లో ఆరోగ్యాన్ని, ఆశను, భరోసాను నింపుతోంది.సమాజానికి ఉపయోగపడే ఒక కల, నిజమైన స్నేహితుల చేతుల్లో పడితే ఎంత గొప్ప ఉద్యమంగా మారుతుందో తాళ్ల సుమన్ గౌడ్, మహమ్మద్ అసద్ ఖాన్, తూర్పు వివేకానంద రెడ్డి తమ జీవితాలతో నిరూపించారు.బోధన్ క్యాంపస్‌లో మొలిచిన ఆ స్నేహం? నేడు ఎనిమిది కార్పొరేట్ ఆసుపత్రుల రూపంలో వేలాది హృదయాల్లో వెలుగుతోంది.స్నేహం శాశ్వతమైతే, సేవ అమరత్వాన్ని అందుకుంటుంది ఇదే ఈ ముగ్గురు మిత్రుల జీవితం చెబుతున్న గొప్ప సందేశం.



# తన్నీరు వర్సెస్ కల్వకుంట్ల





## చాపకింద నీరులా పోరు

మెదక్, ఆగస్టు 1, (న్యూస్ పల్స్) సిద్ధిపేట జిల్లాలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ లీడర్ తన్నీరు హరీశ్ రావు నిర్వహించిన పాదయాత్ర గులాబీ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య చర్చకు తెరలేపింది. రైతాంగ సమస్యలు, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి విడుదల డిమాండ్‌తో హరీశ్ రావు చేపట్టిన ఈ యాత్రకు క్షేత్రస్థాయిలో ప్రజలు, రైతుల నుంచి విశేష స్పందన లభించింది. కేవలం నియోజకవర్గ లేదా జిల్లా స్థాయి నిరసనగా కాకుండా, ఒక బహుళ ప్రజా ఉద్యమంగా ఈ యాత్ర రూపాంతరం చెందడంతో రాష్ట్రవ్యాప్తంగా హరీశ్ రావు పాదయాత్ర చేపడితే పార్టీకి పూర్వవైభవం సాధించడం తేలికవుతుందనే అభిప్రాయాలు బీఆర్ఎస్ వర్గాల్లో బలపడుతున్నాయి.అయితే, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌ను మళ్లీ అధికార దిశగా నడిపించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రస్థాయి యాత్రలు, సభల బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కేటీఆర్ నేతృత్వంలోనే కార్యక్రమాలు చేపట్టాలని హైకమాండ్ భావిస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయి కేడర్ మాత్రం మాస్ కనెక్టివిటీ ఉన్న హరీశ్ రావు వైపే ఎక్కువగా మొగ్గుచూపుతున్నట్లు కనిపిస్తోంది. పల్లెల్లో రైతులు, సామాన్య ప్రజలతో కలిసిపోయే నైజం, సుదీర్ఘమైన సంక్షోభ నిర్వహణ అనుభవం ఉన్న హరీశ్ రావు అయితేనే కాంగ్రెస్ వైఫల్యాలను జనంలోకి బలంగా తీసుకెళ్లగలరనే వాదన గులాబీ శ్రేణుల్లో విపరీతంగా పెరిగింది.ఈ భిన్నమైన అభిప్రాయాలు బీఆర్ఎస్ లోపల ఏమైనా అంతర్గత సంక్షోభాన్ని కాకపోయినా నాయకత్వ సవాలు గా చూడవచ్చు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచీ కేటీఆర్ గ్రామీణ, పట్టణ డిజిటల్ నెట్‌వర్కింగ్, నేషనల్ అప్పీల్‌తో కార్పొరేట్ లుక్‌ను ప్రతిబింబిస్తే, హరీశ్ రావు పక్కా తెలంగాణ మాస్, అగ్రికల్చర్, గ్రౌండ్–లెవల్ ఆర్గనైజేషనల్ పవర్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సోషల్ మీడియా బిల్డప్‌ల కంటే భౌతికంగా జనంలో తిరిగే నాయకుడికే ఎక్కువ ఆదరణ ఉంటుంది కాబట్టి, సహజంగానే హరీశ్ రావు గ్రాఫ్ పార్టీ శ్రేణుల్లో పైచేయి సాధిస్తోంది. కేసీఆర్ క్రియాశీల రాజకీయాలకు కొంత దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమైన ప్రస్తుత వాతావరణంలో, పార్టీకి అధిపతి ఎవరు అనే దానిపై ద్వితీయ శ్రేణి నాయకత్వంలో గందరగోళం నెలకొంది. కేటీఆర్‌ను తదుపరి వారసుడిగా ప్రొజెక్ట్ చేసే క్రమంలో హరీశ్ రావు పాత్రను కేవలం సిద్ధిపేట లేదా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధికే పరిమితం చేస్తున్నారనే అసంతృప్తి హరీశ్ మద్దతుదారుల్లో చాలా కాలంగా ఉంది. ఇప్పుడు సిద్ధిపేట పాదయాత్ర సక్సెస్ కావడంతో.. హరీశ్ రావుకు రాష్ట్రస్థాయిలో స్వేచ్ఛనిస్తే కేటీఆర్ ప్రాబల్యం తగ్గుతుందనే ముందస్తు వ్యూహంతోనే ఆయనను మిగతా జిల్లాల్లో పాదయాత్రలకు అనుమతించడం లేదనే ఆరోపణలు విపక్షాల నుంచి రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి మార్క్ అగ్రెసివ్ రాజకీయాన్ని ఎదుర్కోవాలంటే కేవలం హైదరాబాద్ వేదికగా చేసే ప్రెస్ మీట్లు, ట్విట్టర్ వార్లతో సాధ్యం కాదని బీఆర్ఎస్ శ్రేణులు గుర్తించాయి. ఈ క్రమంలోనే ధర్నా చౌక్‌లు, ప్రాజెక్టుల సందర్శన, పొలాల బాట పట్టే విషయంలో హరీశ్ రావు చూపిస్తున్న చొరవను పార్టీ శ్రేణులు స్వాగతిస్తున్నాయి. ఈ పరిణామాలు బీఆర్ఎస్‌లో ప్రత్యక్ష చీలికకు దారితీయకపోయినా, అధికారికంగా పార్టీని నడిపిస్తున్న వర్గానికి, క్షేత్రస్థాయి బలమున్న హరీశ్ వర్గానికి మధ్య ఒక రకమైన సైలెంట్ పవర్ స్ట్రగుల్ నడుస్తోందనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. కేసీఆర్ స్పందించి కేటీఆర్, హరీశ్ రావుల మధ్య స్పష్టమైన బాధ్యతల విభజన చేయకపోతే ఈ నెరేటివ్ పార్టీకి తీవ్ర నష్టం చేకూర్చే అవకాశం ఉంది. ఒకరికి గ్రేటర్ హైదరాబాద్, అర్బన్ నియోజకవర్గాలు, మరొకరికి రూరల్ తెలంగాణ, రైతు పోరాటాల బాధ్యతలు అప్పగించాలన్న సూచనలు కూడా పార్టీ పెద్దలకు అందుతున్నాయి.

## శారీరక దృఢత్వం పోలీసింగ్‌కు పునాది

**ప్రజాసేవలో ఉత్తమ ఫలితాలకు క్రమశిక్షణ తప్పనిసరి**
**అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి**
**వారాంతపు కవాతుకు హాజరైన జిల్లా ఎస్పీ డి.జానకి,**

మహబూబ్ నగర్,జిల్లా పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ శారీరకంగా దృఢంగా, మానసికంగా అప్రమత్తంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ జానకి, సూచించారు.శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో నిర్వహించిన వారాంతపు కవాతుకు జిల్లా ఎస్పీ హాజరై పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కవాతులో పాల్గొన్న అధికారులు, పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు.పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, వాటిని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, అప్రమత్తత అత్యంత అవసరమని ఎస్పీ తెలిపారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రతిరోజూ వ్యాయామం, పరేడ్, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొని తమ శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ప్రజలకు మెరుగైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో సమయపాలన, అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమ సేవల ద్వారా శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్.బి.రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, రూరల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


## సియం రేవంతన్నకు హృదయపూర్వక ధన్యవాదాలు



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 01: తెలంగాణ రాష్ట్రంలోని 436 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత వది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులకు ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు ఇవ్వాలి అని ఒక విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకోవడమే కాకుండా ఈరోజు ఒకటవ తేదీన జీతాలు విడుదల చేసిన శుభ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి గెస్ట్ లెక్చరర్స్ సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా గెస్ట్ లెక్చరర్స్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సదానందం గౌడ్ మాట్లాడుతూ గత పదేండ్ల పాలనలో మూడు నెలలకు, ఆరు నెలలకు ,సంవత్సరానికి జీతాలు తీసుకుని అనేక ఇబ్బందులు పడ్డాం. కానీ ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగస్తులు అందరు సమానమే అనే భావనతో ఉ ద్యోగులందరని సంతోషకరంగా ఉంచాలని ఒకే లక్ష్యంతో గెస్ట్ లెక్చరర్స్ కు కూడా ఒకటవ తేదీన జీతాలు చెల్లించడం చాలా సంతోషదాయకం అన్నారు. ఇందుకు సహకరించిన గెస్ట్ లెక్చరర్స్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు. అదే విధంగా గెస్ట్ లెక్చరర్స్ అందరికి ఉ ద్యోగ భద్రత కల్పించి చరిత్ర లో చిరస్థాయిగా నిలిచిపోవాలని ఒక ప్రకటనలో సదానందం గౌడ్ విజ్ఞప్తి చేశారు

## పేద ప్రజల భూముల సమస్యపై ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి

**100 అడుగుల రోడ్డు విస్తరణలో బాధితులకు న్యాయం చేయాలి**
**మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.**



తెలంగాణ పవర్ న్యూస్ హయత్ నగర్ డివిజన్ ఎల్బీనగర్ ఆగస్టు హయత్‌నగర్ మండల పరిధిలోని హన్మగల్ -- హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీలో ఉన్న సర్వే నెం. 255/1 భూముల సమస్యపై మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు బాధితులతో కలిసి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ గారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు.

ఈ సందర్భంగా బాధితుల తరఫున మాట్లాడుతూ, సర్వే నెం. 255/1లో మొత్తం 74 ఎకరాల 37 గుంటల భూమి ఉండగా, అందులో సుమారు 18 ఎకరాల భూమికి సంబంధించిన వివాదం నెలకొన్నట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వం వ్యవసాయం చేస్తున్న రైతులకు పట్టాలు మంజూరు చేసిందని, అనంతరం కొందరు రైతులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చిన్న చిన్న ప్లాట్లుగా విభజించి పేద కుటుంబాలకు విక్రయించారని వివరించారు. ప్రస్తుతం ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతోందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

ఈ విషయాన్ని ఎంపీ ఈటల రాజేందర్ గారు వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి సమస్యపై పూర్తి వివరాలు తెలుసుకొని, బాధితులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలియజేశారు.

అదేవిధంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజల హక్కులకు భంగం కలిగితే భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతుందని . పేదల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు అనంతరం శుభోదయం కాలనీలో హయత్ నగర్ నుండి తారామతి పేట. వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణ నేపథ్యంలో ఇల్లు కోల్పోయే ప్రమాదం ఉన్న బాధిత కుటుంబాలతో కలిసి వివరించారు మదర్ డైరీ సమీపంలో ప్రభుత్వం గతంలో కేటాయించిన 60 గజాల స్థలాల్లో ఇల్లు నిర్మించుకుని ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్నామని 100 అడుగుల రోడ్డు విస్తరణలో తమ ఇల్లు పూర్తిగా ప్రభావితమవున్నాయని దీంతో 100కు పైగా కుటుంబాలు నిరాశయులు అయ్య పరిస్థితి ఏర్పడింది అని ఆవేదన వ్యక్తం చేశారు ఎంపీ బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు, మహిళలు యువత బాధితులు తదితరులు పాల్గొన్నారు

# ఆగస్టు 15 నుంచి కొత్త పెన్షన్లు



వరంగల్, ఆగస్టు 1, (న్యూస్ పల్స్)తెలంగాణ రాష్ట్రంలో కొత్త పింఛన్ల పంపిణీని ఆగస్టు 15 నుంచి ప్రారంభించాలనే నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్నారు. ఈ పింఛన్లు ముఖ్యంగా తలసేమియా, సికిల్ సెల్ ఎనిమియా బాధితుల కోసం ప్రత్యేకంగా అందించబడనున్నాయి. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్ శాఖపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వెల్లడించారు. ముఖ్యమంత్రి, బాధిత కుటుంబాలకు ఉపశమనం కలిగించేందుకు ఈ పింఛన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అర్హులైన బాధితులను గుర్తించి, వెంటనే పింఛన్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వితంతు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులందరికీ కూడా పింఛన్లు మంజూరు చేయాలని సీఎం సూచించారు. దివ్యాంగులు చనిపోయినప్పుడు వారి భార్యలకు ఆలస్యం లేకుండా వెంటనే పింఛన్లు అందించాలనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.మండల స్థాయిలో అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు ఎంపీడీవోలు బాధ్యత వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. మండల పరిషత్తు సమావేశాలను 45 రోజులకు ఒకసారి నిర్వహించాలని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని తెలిపారు. ఈ సమావేశాలు గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు సహాయపడతాయని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. పంచాయతీ కార్యాలయాలు గ్రామ జనాభా ఆధారంగా వర్గీకరించి నిర్మించాలనే ఆదేశాలు కూడా ఇచ్చారు. పారిశుద్ధ్య పనులు, ఇతర అంశాలకు సంబంధించి కార్యదర్శులు పూర్తి స్థాయిలో బాధ్యత వహించాలని సీఎం తెలిపారు.ఇందిరమ్మ చీరల పంపిణీకి సంబంధించి నాణ్యత విషయంలో రాజీపడొద్దని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో తాగు నీటి సరఫరాలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామీణ తాగు నీటి సరఫరా, హైదరాబాదు వాటర్ బోర్డ్, ఇరిగేషన్ అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించాలి. తాగు నీటికి ప్రాధమికత ఇవ్వాలని ఆయన తెలిపారు. గ్రామీణ తాగు నీటి పథకాల పరిధిలో పనిచేసే వారికి వేతనాలు కచ్చితంగా ఐదో తేదీలోపు అందించాలనే ఆదేశాలు ఇచ్చారు. కోటి మంది మహిళలకు పంపిణీ చేయాల్సిన ఇందిరమ్మ చీరలు ఆకట్టుకునే డిజైన్‌లో ఉండాలని, నాణ్యత విషయంలో ఎటువంటి రాజీపడొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డిజైన్ల రూపకల్పనలో నిఫ్ట్ విద్యార్థులను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

# కమలం కొత్త వ్యూహం

హైదరాబాద్ ఆగస్టు 1, (న్యూస్ పల్స్)తెలంగాణాలో బీజేపీ రాజకీయ వ్యూహాన్ని మార్చింది. కేంద్ర నాయకత్వం తలంటడంతో ఇప్పుడు తెలంగాణ కమలం పార్టీ నేతలు యాక్టివ్ అయ్యారు. సోషల్ మీడియాలో తెలంగాణ నాయకులు వెనకబడి ఉండటాన్ని కేంద్ర నాయకత్వంతో పాటు రాష్ట్ర పార్టీ ఇన్ ఛార్జులు కూడా తప్పుపట్టారు. డిజిటల్ యుగం నడుస్తున్న సమయంలో ఇలా వెనకబడి ఉంటే పార్టీ ఎలా ఎదుగుతుందని ప్రశ్నించారు. ఇకపై రీల్స్ చేయడం, మిమ్స్ వంటి వాటితో ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నించాలని, తెలంగాణలోని ప్రతి ఒక్క బీజేపీ నేతల సోషల్ మీడియాలో యాక్టివ్ కావాలని, వారి ఫాలోయిర్స్ సంఖ్య పెరగాలని ఆదేశాలు జారీచేసింది.తెలంగాణ ప్రభుత్వం. ఇటీవల సోషల్ మీడియా వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భవించి ఎన్ని మిలియన్ల మందికి దగ్గరయిందో గుర్తుకు తెచ్చుకోవాలని రాష్ట్ర నేతలకు బీజేపీ కేంద్ర నాయకత్వం క్లాస్ పీకింది. తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల విధానాలపై సోషల్ మీడియా వేదికగా బీజేపీ దూకుడు పెంచింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం, వ్యూహాత్మక పోస్ట్‌లతో ట్రెండింగ్ సృష్టించడం మరియు డిజిటల్ క్యాంపెయిన్ల ద్వారా కేడర్‌లో జోష్ నింపడం వంటి అంశాలపై ఆ పార్టీ ప్రధానంగా దృష్టి సారించింది. ఇందుకోసం ప్రతి నేత సోషల్ మీడియాను హ్యాండిల్ చేసేందుకు సిబ్బందిని కూడా నియమించుకున్నారని తెలిసింది. తమ పర్యటనలతో పాటు ప్రభుత్వంపై విమర్శలు కూడా ఇందులో చోటు చేసుకుంటున్నాయి. సోషల్ మీడియా వ్యూహాలతోనే అధికారంలోకి రాగలమని బీజేపీ కేంద్ర నాయకత్వం నమ్ముతుంది. దేశంలో, రాష్ట్రంలోసోషల్ మీడియా వినియోగం పెరిగిపోవడంతో దానిని అందిపుచ్చుకుని వెళితే తప్ప అధికారానికి దగ్గరకు కాలేమని పదే పదే చెప్పిన మాటలు కమలనాథులకు ఇప్పటికి చెవికి ఎక్కినట్లున్నాయి. ప్రభుత్వంపై విమర్శలతో పాటు కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పాలనా విధానాలను, నిర్ణయాలను నిరసిస్తూ నిరంతరం డిజిటల్ అస్త్రాలు సంధిస్తున్నారురాష్ట్ర ప్రభుత్వ హామీలు, ప్రజా సమస్యలపై ప్రత్యేక హ్యాష్‌ట్యాగ్‌లతో సోషల్ మీడియాలో పోస్టులు హోరెత్తిస్తున్నారు.రాష్ట్ర నాయకులు సైతం ఆన్‌లైన్ చర్చల్లో పాల్గొంటూ కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. మొత్తం మీద తెలంగాణ బీజేపీలో పెద్ద మార్పు వచ్చినట్లుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.




# క్యూర్ కు 28 శాతం మార్కులే

హైదరాబాద్ ఆగస్టు 1, (న్యూస్ పల్స్)70 ఏళ్ల చరిత్ర కలిగిన జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన 'క్యూర్' ముసాయిదా బిల్లు మహానగర పాలనా సంస్కరణల విషయంలో ఆశించిన స్థాయిలో లేదని విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. బెంగళూరు కేంద్రంగా పని చేసే పాలనా అధ్యయన సంస్థ 'జనాగ్రహ' నిర్వహించిన సమీక్షలో ఈ ముసాయిదాకు కేవలం 28 శాతం మార్కులే లభించాయి. పొరుగు రాష్ట్రమైన కర్ణాటక తీసుకొచ్చిన 'గ్రేటర్ బెంగళూరు అథారిటీ' (జీబీఏ చట్టం 2024) సాధించిన 38 శాతంతో పోలిస్తే.. హైదరాబాద్ కోసం ప్రతిపాదించిన ఈ బిల్లు సంస్కరణల పరంగా వెనుకబడి ఉందని సదరు అధ్యయనం ఎత్తిచూపింది.హైదరాబాద్ నగరాన్ని సమగ్రమైన ఏకైక అర్బన్ రీజియన్‌గా ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు ఒక అధికారిక ఏకీకృత వ్యవస్థ లేకపోవడమే ఈ బిల్లులోని ప్రధాన లోపంగా విశ్లేషణ పేర్కొంది. ప్రస్తుతం రవాణా, గృహ నిర్మాణం, మురుగునీటి పారుదల, భూ వినియోగం వంటి కీలకమైన బాధ్యతలను వివిధ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీలు ఎవరికి వారే స్వతంత్రంగా నిర్వహిస్తున్నాయని నివేదిక తెలిపింది. వేర్వేరు సంస్థల మధ్య అనుసంధానం లోపించడంతో నగర అభివృద్ధి ప్రణాళికలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయని స్పష్టం చేసింది.నగర పాలన సమర్థవంతంగా సాగాలంటే ప్రజలు ఎన్నుకున్న స్థానిక ప్రజాప్రతినిధులకు సమస్యలను తక్షణమే పరిష్కరించే అసలైన అధికారాలు ఉండాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా మేయర్, కౌన్సిల్‌ల అధికారాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని.. నైబర్‌హుడ్ పరిధిలోని నిర్ణయాల్లో స్థానిక పౌరులకు భాగస్వామ్యం కల్పించేలా స్పష్టమైన నిబంధనలు చేర్చాలని సూచించారు. నగర పరిపాలనా వ్యవస్థను నిరంతరం జవాబుదారీగా ఉంచేందుకు స్వతంత్ర పర్యవేక్షణ, తనిఖీ యంత్రాంగాన్ని నెలకొల్పాలని పేర్కొన్నారు. మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీ (ఎంపీసీ), హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉండే అత్యున్నత పాలనా మండలి విధుల మధ్య ఎలాంటి పునరావృతం లేకుండా స్పష్టమైన విభజన ఉండాలని పేర్కొన్నారు.బృహత్తర నగరాల నిర్వహణలో భారత దేశంలోనే హైదరాబాద్ ఒక మార్గదర్శక మహానగర పాలనా నమూనాగా ఎదిగేందుకు గొప్ప అవకాశం ఉందని జనాగ్రహ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ విశ్వనాథన్ అభిప్రాయ పడ్డారు. అత్యున్నత పాలనా మండలి సజావుగా పని చేసేందుకు ఒక పూర్తిస్థాయి సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే నగర ప్రాధాన్యతలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు హైదరాబాద్ వ్యవహారాల మంత్రి వంటి ప్రత్యేక రాజకీయ బాధ్యుడిని నియమించాలని ఆయన స్పష్టం చేశారు.

# మిడిల్ క్లాసు కష్టాలు...

హైదరాబాద్ ఆగస్టు 1, (న్యూస్ పల్స్)ఒకటో తారీకు జీతం వస్తుంది. ఆ తర్వాత ఈఎంఐ కట్టాలి. క్రెడిట్ కార్డు బిల్లు కట్టాలి.. ఇంటి రెంట్ కట్టాలి. పిల్లల స్కూల్ ఫీజులు కట్టాలి. నెలవారి ఖర్చుకు ఎంతోకొంత ఎకౌంట్లో ఉంచుకోవాలి. ఇవన్నీ చేసిన తర్వాత ఏం మిగులుతుంది..జీతం ఆవగింజంత ఉంటే.. ఖర్చులు మామిడికాయ సైజులో ఉంది. ఇలాంటప్పుడు నాలుగు రాళ్లు వెనక వేయడం కాదు కదా.. కనీసం జీవితాన్ని ముందుకు సాగించడం కూడా కష్టమే. నచ్చినవి తినలేము. ఇష్టమైన వాటిని కొనుగోలు చేయలేము. బాగున్న వాటిని సొంతం చేసుకోలేము. ఊహల్లో బతకడం.. కష్టాలను తిట్టుకోవడం.. ఇదే మిడిల్ క్లాస్ జీవితం..మనదేశంలో పేదవాళ్లు ఒక అంచనాలో బతుకుతారు. డబ్బున్న వాళ్లు కూడా ఒక అంచనాలో బతుకుతారు. కానీ మిడిల్ క్లాస్ వాళ్ళు ఎటువంటి అంచనా వేసుకోలేరు. ఎందుకంటే వాళ్లకు ప్రతి విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఏవైనా నిర్ణయాలు తీసుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని.. ముందుగానే జాగ్రత్త పడతారు. జాగ్రత్తగా ఉన్నంత మాత్రాన ఖర్చులు ఆగవు కదా.ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో జీవించే మిడిల్ క్లాస్ వాళ్లకు ప్రతిరోజు ఒక పజిల్ మాదిరిగానే ఉంటుంది. అక్కడ జీవించే మిడిల్ క్లాస్ ప్రజల కష్టాల మీద ఒక వ్యక్తి చేసిన వీడియో సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది. ఈఎంఐ.. కిరాయిలు.. కుటుంబ ఖర్చులు.. వీటన్నింటికీ జీతం సరిపోక కనీసం మటన్ కూడా కొనుగోలు చేయడం కష్టమవుతుంది. జీవితంలో ఎటువంటి ఎదుగుదల లేకుండా.. పెళ్లి జరిగిన తర్వాత.. పిల్లలు పుట్టిన తర్వాత.. వారి బాధ్యతలతోనే జీవితం సంకనాకి పోతుందని.. ఆ వీడియోలో ఉన్న వ్యక్తి చెప్పాడు. ఈ వీడియోను చాలామంది తమకు అనుకూలంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. తమది కూడా ఇటువంటి దుస్థితేనని వాపోతున్నారు. మా మనసులో ఉన్న బాధను మొత్తం వ్యక్తం చేశావని చాలామంది కామెంట్లు చేస్తున్నారు.గతంతో పోల్చి చూస్తే హైదరాబాద్ నగరంలో మిడిల్ క్లాస్ వల్ల కష్టాలు విపరీతంగా పెరిగిపోయాయి. అన్ని ఖర్చులు పెరిగిపోవడం.. వాటికి తగ్గట్టుగా వేతనాలు పెరగపోవడంతో చాలామంది ఆర్థికంగా కష్టాలు పడుతూనే ఉన్నారు. పెళ్లి.. పిల్లలు.. బాధ్యతలు.. ఇవన్నీ కళ్ళ ముందు కనిపిస్తుంటాయి కాబట్టి.. చాలామంది కష్టాలను పంటి కింద భరిస్తూ.. తమ ఇబ్బందులను తిట్టుకుంటూ జీవితాన్ని సాగిస్తుంటారు. ఎందుకంటే అంతకుమించి చేయడానికి మిడిల్ క్లాస్ వాళ్లకు అవకాశం లేదు.

# రహదారి భద్రతను మరింత కట్టుదిట్టం

## అక్రమ పార్కింగ్ పై కఠిన చర్యలు

**తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ హెచ్చరిక**

మహబూబాబాద్,తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో) శంకర్ నాయక్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం, మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారుల వెంట రహదారి భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారుల వెంట ఉన్న భోజనశాలలు, హోటళ్లు, విశ్రాంతి కేంద్రాల వద్ద లారీలు, బస్సులు, ట్రాక్టర్లు తదితర భారీ వాహనాలను రాత్రి వేళల్లో నిర్లక్ష్యంగా నిలిపివేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారి పక్కన నిలిపిన వాహనాలకు వెనుక భాగంలో ఎరుపు ప్రతిబింబించే వట్టీలు లేదా ప్రతిబింబించే పలకలు, నిలుపుదల దీపాలు, హెచ్చరిక త్రిభుజ గుర్తులు లేకపోవడం వల్ల వేగంగా వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం అధికంగా ఉంటుందని తెలిపారు. డ్రైవర్లు, వాహన యజమానులు తప్పని సరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. మోటారు వాహనాల చట్టం?1988, సెక్షన్ 122 ప్రకారం జాతీయ రహదారులపై అకారణంగా లేదా ఇతరులకు ప్రమాదం కలిగే విధంగా వాహనాలను నిలిపి వేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. అలాంటి వాహనాల ఛాయాచిత్రాలు, దృశ్యాల ఆధారంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా వాహనాలు నిలిపివేయరాని ప్రాంతాల్లో వాహనాలను నిలిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రహదారిపై నిర్లక్ష్యంగా వాహనాలను వదిలేయడం వల్ల ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే కఠిన చర్యలు తప్పవన్నారు. రవాణా శాఖ సూచనలు మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులు మినహా వాహనాలను నిలిపి వేయరాదు. వాహనాలను భోజనశాలలు, హోటళ్ల ముందు లేదా రహదారి అంచున ప్రమాదకరంగా నిలిపివేయరాదని, తప్పని సరిగా ఆపాల్సి వస్తే రహదారికి సురక్షితమైన దూరంలో మాత్రమే నిలిపివేయాలని, వాహనం వెనుక భాగంలో ఎరుపు ప్రతిబింబించే పట్టీలు లేదా ప్రతిబింబించే పలకలు, ప్రతిబింబించే పట్టీ, నిలుపుదల దీపాలు తప్పనిసరిగా ఉండాలి.రాత్రి సమయంలో ప్రతిబింబించే హెచ్చరిక త్రిభుజ గుర్తు ఏర్పాటు చేయాలని, వాహనాల సాంకేతిక సామర్థ్య ధ్రువీకరణ (ఫిట్‌నెస్), బ్రేకులు, టైర్లు, దీపాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలి.అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం పూర్తిగా నివారించాలని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయం ద్వారా ఒక ప్రకటన ద్వారా తెలపడం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ రహదారులపై డీటీవో శంకర్ నాయక్ మాట్లాడుతూ, "మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరి భద్రతే మా ప్రధాన లక్ష్యం. వాహన యజమానులు, డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.

## మహిళను మోసం చేసిన ఎస్సై అరెస్టు

హైదరాబాద్,తెలంగాణలో మహిళలను వేధిస్తున్న పోలీసుల జాబితాలో మరో ఎస్సై పేరు చేరింది. మహిళలపై లైంగిక దాడి కేసులో ఎస్సై శ్రీకాంత్ అరెస్ట్ అయ్యాడు. సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకొని మహిళలను మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై లైంగిక దాడి చేసినట్లు కేసు నమోదయింది. హైదరాబాద్ యువతి ఫిర్యాదుతో జగిత్యాల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసారు. సాంకేతిక ఆధారాలతో నిజామాబాద్లో పోలీసులు నిందితుడిని గుర్తించారు. ఎస్సై శ్రీకాంత్ను అరెస్ట్ చేసి హనుమకొండకు తరలించారు. నిందితుడు సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎస్సైగా గుర్తించారు.

# నిరుపేద మహిళకు లయన్స్ క్లబ్ చేయూత

## సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్
## డైరెక్టర్ లయన్ బాబూరావు
## -క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్

కమాన్ పూర్ ,ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన నిరుపేద ఒంటరి మహిళ నివసిస్తున్న కిరాయి ఇల్లు కూలిపోవడంతో ఆమె తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సభ్యులు, లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబూరావు జన్మదినాన్ని పురస్కరించుకుని, బాధిత మహిళకు నిత్యావసర సరుకులను అందజేసి తమ సేవా భావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్ మాట్లాడుతూ అంతర్జాతీయ డైరెక్టర్గా ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్ల సేవా కార్యక్రమాలకు మార్గనిర్దేశం చేస్తూ సేవే పరమావధి అనే భావనతో లక్షలాది మంది లయన్స్ సభ్యులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆయన నాయకత్వం, సేవా తపన, నిస్వార్థ అంకితభావం లయన్స్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. సమాజ సేవే లయన్స్ ఉద్యమానికి మూల స్ఫూర్తి అని, అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ చేయూత అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి టీవీ సురేష్ బాబు, పాస్ట్ ప్రెసిడెంట్లు మొల్కూరి శ్రీనివాస్, మేకల మారుతి యాదవ్, క్లబ్ చైర్పర్సన్లు గంట వెంకటరమణ రెడ్డి, మర్రి శరణ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ టీఎఎ ద్వారా 125 మంది చిన్నారుల రక్షణ

## జిల్లా ఎస్పీస్నేహా మెహ్రో,

వికారాబాద్ ,జిల్లా వ్యాప్తంగా అన్నీ శాఖల సమన్వయం తో ఆపరేషన్ ముస్కాన్?చీఎఎ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, భిక్షాటన, విద్యకు దూరమైన చిన్నారులను గుర్తించి రక్షించేందుకు జిల్లా పోలీసులు సంబంధిత శాఖలతో సమన్వయంగా విస్తృత చర్యలు చేపట్టినట్టు జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రో, ఎఖూ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గత నెల మొదటి నుండి 31-07-2026 వరకు జిల్లాలో మొత్తం 125 మంది చిన్నారులను రక్షించినట్లు తెలిపారు. వీరిలో 116 మంది బాలురు, 9 మంది బాలికలు ఉన్నారు. రక్షించబడిన చిన్నారుల్లో 97 మంది బాల కార్మికులు, 26 మంది చదువు మానేసిన (డ్రాప్‌ఔట్) చిన్నారులు, ఒకరు భిక్షాటనలో ఉన్న చిన్నారి, ఒక బాల్య వివాహాన్ని అడ్డుకుని సంబంధిత చిన్నారిని రక్షించినట్లు తెలిపారు.ఇతర రాష్ట్రాలకు చెందిన 41 మంది చిన్నారులను కూడా గుర్తించి రక్షించినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్?చీఎఎలో భాగంగా ఇప్పటి వరకు 54 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే రక్షించిన చిన్నారుల్లో 89 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించగా, 36 మందిని బాలల సంరక్షణ గృహాలకు తరలించినట్లు వెల్లడించారు.జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రో, ఎఖూ మాట్లాడుతూ, బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, చిన్నారుల అక్రమ రవాణా, భిక్షాటన, పిల్లలను చదువుకు దూరం చేసే చర్యలపై జిల్లా పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. చిన్నారుల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల కార్మికులు లేదా ప్రమాదంలో ఉన్న చిన్నారులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్?100, చైల్డ్ హెల్ప్‌లైన్?1098కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్?చీఎఎను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రతి చిన్నారి సురక్షితమైన, విద్యతో కూడిన భవిష్యత్తు పొందేలా అన్ని శాఖలతో కలిసి కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు

# మందుబాబులకు అడ్డాగాకొత్తపల్లి జంక్షన్


కరీంనగర్ ఆగస్టు01కొత్తపల్లి జంక్షన్ ప్రాంతం రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం చీకటి పడిన వెంటనే కొందరు వ్యక్తులు జంక్షన్ వద్ద గుంపులుగా చేరి మద్యం సేవిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.మద్యం సేవించిన అనంతరం బీరు సీసాలను రోడ్డుపైనే పగులగొడుతూ, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు.అంతేకాకుండా, రోడ్డుపై పగులగొట్టిన బీరు సీసాల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది వ్యక్తులు బహిరంగంగానే మద్యం సేవించడం వల్ల స్థానిక ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని పేర్కొంటున్నారు.రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాల్సిన పోలీసులు, రైల్వే సిబ్బంది, రైల్వే పోలీసులు సైతం ఈ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చీకటి పడిన తర్వాత కనీసం అటువైపు కూడా చూడటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

# పరుగెత్తండి.. ప్రాణాలు కాపాడండి

## అక్టోబరు 11న గ్రేస్ క్యాన్సర్ రన్

క్యాన్సర్ను ముందే గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్న సందేశంతో నిర్వహిస్తున్న గ్లోబల్ క్యాన్సర్ రన్-2026 తొమ్మిదో ఎడిషన్ ను ఘనంగా ప్రకటించారు. జూబ్లీహిల్స్ లో జరిగిన కార్యక్ర మంలో సినీ దర్శకుడు అనిల్ రావిపూడి, నటి నిధి అగర్వాల్ పాల్గొని రన్ అధికారిక టీ-షర్ట్, ఫినిషర్స్ మెడల్ను ఆవిష్కరించారు. అక్టోబరు 11న గచ్చిబౌలి స్టేడియంలో ఈ రన్ నిర్వహించనున్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీనియర్ రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా.చిన్నబాబు సుంక వల్లి మాట్లాడుతూ ఈ రన్ ద్వారా సమీకరించే నిధులతో మొబైల్ స్క్రీనింగ్ వాహనాల ద్వారా లక్ష మంది పేదలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. టీ-షర్ట్ ఆవిష్కరణలో అనిల్ రావిపూడి, నిధి అగర్వాల్, డా.చిన్నబాబు సుంకవల్లి తదితరులు పాల్గొన్నారు.

## కీవ్‌పై మిస్సైల్లు, డ్రోన్లతో దాడి.. 9 మంది మృతి, 22 మందికి గాయాలు



కీవ్: రష్యా మళ్లీ విరుచుకుపడింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసింది. శనివారం ఉదయం ఆ అటాక్ జరిగింది. ఆ దాడిలో 9 మంది మృతిచెందగా, 22 మంది గాయపడినట్లు తెలుస్తోంది. సోలోమియానస్కీ జిల్లాలో ఉన్న 5 అంతస్తుల రెసిడెన్షియల్ బిల్డింగ్ దెబ్బతిన్నది. ఆ బిల్డింగ్‌లో ఉన్న 35 మంది తరలించారు. దర్నిట్స్కి జిల్లాలో జరిగిన దాడి వల్ల ఏడు మంది మృతిచెందగా, మరో 14 మంది గాయపడ్డారు. అటాక్ వల్ల ఇండ్లు కూలి మంటలు వ్యాపించాయి. ఆ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. కీవ్ సమీపంలో ఉన్న మిలిటరీ పారిశ్రామిక కేంద్రాలు, లాజిస్టిక్ హబ్‌లను టార్గెట్ చేసినట్లు రష్యా పేర్కొన్నది. డజన్ల సంఖ్యలో క్షిపణులను వదిలినట్లు రష్యా చెప్పింది. శుక్రవారం రాత్రి హై ప్రిసిషన్ గ్రౌండ్, సీ లాంచ్డ్ వెపన్స్, లాంగ్ రేంజ్ డ్రోన్లతో అటాక్ జరిగినట్లు రష్యా మిలిటరీ శాఖ పేర్కొన్నది. మిస్సైల్లు, డ్రోన్లు, రేడార్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ ఎక్విప్మెంట్ ఉన్న ప్రొడక్షన్, స్టోరేజీ కేంద్రాలను టార్గెట్ చేసినట్లు రష్యా చెప్పింది.

## జూలైలో రూ.2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ కలెక్షన్లు.. 15.4 శాతం పెరుగుదల




జూలై నెలకు సంబంధించిన గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ (జీఎస్టీ) వసూళ్ల వివరాలు వెల్లడించింది కేంద్రం. జూలైలో రూ.2.11 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు కేంద్రం ప్రకటించింది. ఇందులో సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ) వసూళ్లు రూ.39,835 కోట్లు, స్టేట్ జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) వసూళ్లు రూ.47,881 కోట్లుకాగా ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ) వసూళ్లు రూ.1.23 లక్షలుగా ఉన్నాయి. ఏడాది ప్రాతిపదికన చూస్తే గతేడాది ఇదే నెలకు సంబంధించి జీఎస్టీ వసూళ్లలో 15.4 శాతం పెరుగుదల ఉంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల కోట్ల జీఎస్టీ వసూలు కావడం ఇది రెండోసారి.చివరగా గత ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.2.43 లక్షల కోట్లు వచ్చాయి. ఈ వివరాల్ని కేంద్ర ఆర్థిక శాఖ శనివారం, ఆగష్టు 1న విడుదల చేసింది. జూలై నెలకు సంబంధించి రీఫండ్‌లు కూడా 13.1 శాతం పెరిగి, రూ.29,968 కోట్లకు చేరాయి. విదేశీ దిగుమతుల ద్వారా జీఎస్టీ రెవెన్యూ 28.8 శాతం పెరిగింది. వరుసగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంకేతం అని నిపుణులు అంటున్నారు. జీఎస్టీ వసూళ్లలో హరియాణా అత్యధిక వృద్ధి సాధించింది. అదే సమయంలో గుజరాత్ రెండో స్థానంలో, తెలంగాణ కూడా భారీ వృద్ధి (19 శాతం) నమోదు చేసింది. మరోవైపు ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లపై ఆర్బీఐ అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్ అమలు చేయనున్నట్లు చెప్పింది.దీనిప్రకారం.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కమర్షియల్ బ్యాంక్స్–ఇంటరెస్ట్ రేట్ ఆన్ డిపాజిట్స్) సెకండ్ అమెండ్‌మెంట్ డైరెక్షన్స్, 2026 ప్రకారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా ఒక రోజున కస్టమర్లు డిపాజిట్ చేసే మొత్తాలకు, ఒక అమౌంట్‌కు అన్ని బ్రాంచులలో ఒకే వడ్డీ రేటు చెల్లించాలని ఆదేశించింది. బల్క్ డిపాజిట్లతోపాటు అన్ని రకాల డిపాజిట్లపై వేర్వేరు బ్రాంచుల్లో అయినా సరే ఒక అమౌంట్‌కు, ఒకే రకమైన వడ్డీ చెల్లించాలని, ఈ విషయంలో వివక్ష ఉండకూడదని కూడా ఆర్బీఐ ఆదేశించింది.

## వ్యాపారిపై హత్యాయత్నం.. భాగస్వామితో పాటు మరో ఆరుగురి అరెస్ట్

హైదరాబాద్, ఆగస్టు1, మహారాష్ట్రకు చెందిన పారిశ్రామికవేత్త, జీఎస్ఎమ్ ఫాయిల్స్ కంపెనీ ఎండీ మోహన్‌సింగ్ పర్మార్ (46)పై కాల్పుల జరిగాయి. ఈ ఘటనలో గాయపడిన అతడిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ప్రధాన నిందితుడు సాగర్ గిరీష్ భానుశాలి (33), అతడికి సహకరించినవారిని అరెస్ట్ చేశారు. సాగర్ గిరీష్ భానుశాలి పర్మార్ కంపెనీలోని తోటి భాగస్వామి అని తెలిసి పోలీసులు ఖంగు తిన్నారు.స్టాక్ మార్కెట్‌లో భారీగా నష్టపోయిన సాగర్ గిరీష్ పర్మార్ నుంచి రూ. 32 కోట్లు తీసుకున్నాడు. పర్మార్ అప్పు ఎగ్గొట్టేందుకు, కంపెనీని చేజిక్కించుకునేందుకు పర్మార్‌ను హత్య చేయాలనుకున్నాడు. దీంతో కంపెనీ ఉన్న వసాయ్ (ఎజీబజీతి)లోని నాయక్‌పాడ ప్రాంతంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు పర్మార్‌పై కాల్పులు జరిపారు. ఒక బుల్లెట్ భుజానికి తలిగింది. మరోసారి కాల్పులు జరిపే ప్రయత్నంలో పిస్టల్ జామ్ అయ్యింది. దీంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. సీసీటీ ఫుటేజీలు పరిశీలించిన పోలీసులు సాగర్, అతడికి సహకరించిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.



## కేరళలోని ఇడుక్కిలో భారీ వర్షాలు..

### కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి.. శిథిలాల కింద పలువురు

కేరళను భారీ వర్షాలు ముంచెత్తాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వరదలు సంభవిస్తున్నాయి. కొండచరియలు కూడా విరిగిపడుతున్నాయి. కేరళ, ఇడుక్కి, కొట్టాయం జిల్లాల్లో శనివారం భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి ముగ్గురు మరణించారు. అలాగే, ఈ శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారు. వాగమాన్ జిల్లాలో కూడా కొండచరియలు విరిగిపడటం వల్ల ఒకరు మరణించారు. ప్రభాకరన్ నాయర్ అనే అతడి మృతదేహం ఇంకా లభించలేదు. అడూర్‌మాలా ప్రాంతంలో కూడా కొండచరియలు విరిగిపడటంతో ఒకరు చిక్కుకుపోయారు.అలాగే, కోచి–ధనుష్‌కోడి నేషనల్ హైవే, మాచిప్లావు వద్ద కూడా కొండచరియలు విరిగివడిన కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇడుక్కి జిల్లాలోని ఒక ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ఇంట్లో ఉన్న ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. కొట్టాయం జిల్లాలో శిథిలాల కింద మరికొందరు చిక్కుకుపోయారు. కేరళలోని అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో రోడ్డుపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో అనేక చోట్ల భారీగా ట్రాఫిక్ స్తంభించింది. 183వ జాతీయ రహదారిపై వందిపెరియార్ ప్రాంతంలో నీళ్లు నిలిచిపోయాయి. దీంతో రోడ్డు మార్గం మొత్తం బ్లాక్ అయింది. మరోవైపు నీటి మట్టం ఇంకా పెరిగిపోతోంది. పైగా చుట్టుపక్కల డ్యామ్‌ల నుంచి గేట్లు ఎత్తడంతో ఈ రోడ్డుపైకి ఇంకా నీరు చేరే అవకాశం ఉంది. ఎరాట్టుపేట, కంజిరాపల్లి, కూట్టిక్కల్, ఎరుమెలి వంటి అనేక పట్టణాలు కూడా నీట మునిగాయి.పూంజార్ ప్రాంతంలో ఒక ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఇంట్లో ఇద్దరు చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. భారీ వర్షాలు, వరదల నుంచి ప్రజల్ని రక్షించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేరళలోని వయనాడ్ సహా అనేక ప్రాంతాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరిస్తున్నారు. అనేక ప్రాంతాలకు ఆరెంజ్, రెడ్ అలెర్ట్ జారీ చేశారు.



## భూరీ పెట్టుబడి మోసం కేసును ఛేదించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు

### ప్రధాన నిందితుడి అరెస్టు 35 వాహనాలు స్వాధీనం

లక్ష్మిదేవిపల్లి, ఆగస్టు 01 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం.134/2026 కేసులో ప్రధాన నిందితుడు బేతంపూడి భరత్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుండి నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 35 వాహనాలు, ఇతర చరాస్తులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. శనివారం కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ కేసు వివరాలను వెల్లడించారు. భార్యాటీ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. నిందితుడు భద్రాచలం ఐటీసీ పేపర్ బోర్డ్‌లో లేబర్ కాంట్రాక్టర్‌గా పని చేస్తుస్తున్నానని తెలిపేవాడన్నారు. తనతో భాగస్వామిగా ఉంటే కాంట్రాక్ట్ పనులు ఇప్పించి అధిక లాభాలు అందిస్తానని నమ్మబలికి పలువురు బాధితుల నుండి సుమారు రూ.52 కోట్ల మేర పెట్టుబడుల పేరుతో మోనవూరితంగా డబ్బులు సేకరించినట్లు వెల్లడించారు. బాధితుల విశ్వాసాన్ని పొందేందుకు నకిలీ భాగస్వామ్య ఒప్పందాలు, తప్పుడు పత్రాలు రూపొందించి, లాభాల్లో 4 శాతం వాటా ఇస్తామని హామీలు ఇచ్చి మోసానికి పాల్పడ్డాడు. అలాగే బీకే నాయుడు అండ్ కో, రాజేశ్వరి ట్రావెల్స్ పేర్లతో సంస్థలను నిర్వహిన్తూ ఈ మోనవూరిత కార్యకలాపాలు సాగించినట్లు గుర్తించామన్నారు. సాంకేతిక ఆధారాలు, ఆర్థిక లావాదేవీల విశ్లేషణ ఆధారంగా నిందితుడిని కేరళ రాష్ట్రంలోని పాలా ప్రాంతంలో అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారెంట్‌పై జిల్లాకు తీసుకువచ్చి పోలీసు కస్టడీలో విచారించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 6 బస్సులు, ఒక వాటర్ ట్యాంకర్ లారీ, 3 ట్రాక్టర్లు, 2 వ్యవసాయ పరికరాలు, 7 కార్లు, 14 ద్విచక్ర వాహనాలు, 2 ట్రైలర్లు కలిపి మొత్తం 35 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా బాధితుల నుంచి మోసపూరితంగా సేకరించిన డబ్బుతో భద్రాచలంలోని రాజీవ్‌నగర్ కాలనీలో మూడు అంతస్తుల భవనం, ఒక ప్లాట్ కొనుగోలు చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు.అధిక లాభాలు వస్తాయని, తక్కువ సమయంలో పెట్టుబడికి రెట్టింపు లేదా భారీ రాబడులు వస్తాయని చెప్పే వ్యక్తులు లేదా సంస్థలను గుడ్డిగా నమ్మి డబ్బులు పెట్టవద్దని ప్రజలకు సూచించారు. ఆకర్షణీయమైన హామీలు, నకిలీ పత్రాలు, తప్పుడు ఒప్పందాలతో మోసగాళ్లు ప్రజలను మభ్యపెడుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనుమానాస్పద పెట్టుబడి పథకాలపై సమాచారం తెలిసినా లేదా మోసానికి గురైనా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల అప్రమత్తతతోనే ఇటువంటి ఆర్థిక నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన లక్ష్మీదేవిపల్లి పోలీసు సిబ్బందిని, జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.



## భారీగా తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర..

హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వాణిజ్య సంస్థలకు ఊరట లభించింది. 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలను రూ.200కు పైగా తగ్గిస్తున్నట్టు చమురు మార్కెటింగ్ సంస్థలు శనివారం ప్రకటించాయి. ఇరాన్ యుద్ధం, పశ్చిమ ఆసియా ఉద్రిక్తతల కారణంగా వరుసగా ధరలు పెరిగిన సంగతి తెలిసిందే. ఆ ధరలను క్రమంగా తగ్గిస్తున్నారు ఇటీవలి కాలంలో ఇది వరుసగా రెండో తగ్గింపు కావడం విశేషం. జులైలో వాణిజ్య సిలింబర్ ధరలను రూ.183 తగ్గించిన సంగతి తెలిసిందే. మరో రూ.202 రూపాయలను తగ్గించారు. దీంతో ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర రూ.202 తగ్గి రూ.2,728కు చేరింది. కోల్‌కతాలో రూ.209 తగ్గి రూ.2,872.50కి చేరిందిముంబై, చెన్నై, హైదరాబాద్ సహా ఇతర ప్రధాన నగరాల్లో కూడా గణనీయంగా ధరలు తగ్గాయి. అయితే ఈ తగ్గింపు వాణిజ్య వినియోగ సిలిండర్లకే పరిమితం గృహ వినియోగదారులు ఉపయోగించే 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులూ చేయలేదు. దీంతో సాధారణ కుటుంబాలకు ఈసారి ఎలాంటి ఉపశమనం లభించలేదు.



## కొత్తగూడెం ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా సీహెచ్.వెంకట రమణ బాధ్యతల స్వీకరణ



రుద్రంపూర్, ఆగస్టు 01 : సింగరేణి కొత్తగూడెం ఏరియాకు నూతన జనరల్ మేనేజర్‌గా నియమితులైన సీహెచ్.వెంకట రమణ శనివారం జనరల్ మేనేజర్ ఏరియా కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌వోటు జీఎం గోవిందరావు ఆధ్వర్యంలో ఏరియా ఉన్నతాధికారులు కలిసి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం సీహెచ్.వెంకట రమణ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించి తన కార్యాలయంలోని స్థానంలో ఆసీనులయ్యారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ వి. రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీఎం ఓ ఏ ఐ ఏరియా జనరల్ సెక్రెటరీ ఉపేందర్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్, ఎస్టేట్ అధికారి తౌర్య, ఏరియా వర్క్ షాప్ డీజీఎం క్రిస్టఫర్, ఏరియా వర్క్ షాప్ ఇంజినీర్ శంకర్, ఐ ఈ డి డీజీఎం యోహాన్, ఇతర ఏరియా ఉన్నతాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగ్రకుట్ర భగ్నం.. జైషే మహమ్మద్ నెట్‌వర్క్‌లోని కీలక పాత్రధారి అరెస్ట్

పశ్చిమ బెంగాల్ పోలీసు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) ఉగ్ర కుట్రను భగ్నం చేసింది. ఇటీవలే అరెస్టయిన జైషే మహమ్మద్ (ఏవఓ) అనుమానిత ఉగ్రవాది మహమ్మద్ హమీమ్ మోండల్ స్నేహితురాలు అర్పిత సర్కార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి జార్ఖండ్‌లోని సాహెబ్‌గంజ్‌లో ఎస్‌టీఎఫ్ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్‌కు తరలించారు.అనుమానిత ఉగ్రవాది హమీమ్ మోండల్‌ను గురువారం బర్ధమాన్ పట్టణంలోని ఒక పెద్ద ఇంట్లో ఎస్‌టీఎఫ్ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ (ఎఐ) మద్దతుతో పని చేస్తున్న ఒక పెద్ద ఉగ్ర నెట్‌వర్క్‌లో హమీమ్ కీలక పాత్ర పోషిస్తున్నాడని అధికారులు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లోని బీజేపీ నాయకులతో పాటు పలువురు ముఖ్యమైన వీఐపీల సమాచారాన్ని సేకరించడం వారి టార్గెట్. దీని కోసం కొత్త వారిని రిక్రూట్‌మెంట్‌లో చేర్చుకోవడం, రాష్ట్రంలో ఉగ్ర కార్యకలాపాలకు ప్రణాళికలు రచించేందుకు సిద్ధమయ్యారు.దర్యాప్తులో భాగంగా హమీమ్, అర్పితల మధ్య క్రమం తరచూ జరిగిన వాట్సాప్ సంభాషణల వివరాలను అధికారులు సేకరించారు. పశ్చిమ బెంగాల్‌లోని కీలకమైన రాజకీయ నాయకులతో సంబంధాలు ఏర్పరచుకోవడానికి, వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడానికి హమీమ్ ఈమెను ఒక సాధనంగా వాడుకున్నట్లు ఎస్టీఎఫ్ గుర్తించింది. అరెస్టు అనంతరం ఇద్దరినీ విచారిస్తున్న పోలీసులు, ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న మరికొందరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.



## ఇంటర్నేషనల్ కబడ్డీ ప్లేయర్ భార్య ఆత్మహత్య..

హర్యానాకు చెందిన ఇంటర్నేషనల్ కబడ్డీ ప్లేయర్ శీలు బల్హారా భార్య ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం సాయంత్రం రోహ్‌తక్ జిల్లా మెహమ్ ప్రాంతంలోని నివాసంలో 23 ఏళ్ల ముస్కాన్ విగతజీవిగా కనిపించింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ఫోరెన్సిక్ బృందం ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు ముస్కాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.పోలీసుల ప్రాథమిక దర్యాప్తు వివరాల మేరకు.. 2023 డిసెంబర్ నెలలో ముస్కాన్, శీలుల పెళ్లి జరిగింది. ఈ దంపతులకు గత ఏడాది నవంబర్ నెలలో ఓ కుమారుడు జన్మించాడు. ముస్కాన్ ఆత్మహత్య చేసుకోవడానికి గల ఖచ్చితమైన కారణాలు తెలియరాలేదు. ఆత్మహత్య చేసుకోవడానికి ఒక రోజు ముందు ముస్కాన్ ఓ పంజాబీ పాటకు సంబంధించిన రీల్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. పోలీసులు అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు. ముస్కాన్ ఆత్మహత్యకు గల కారణాలను అన్వేషిస్తున్నారు.



# మండలి కోసం పడపోతలు షురూ

విజయవాడ, ఆగస్టు 1,ఆంధ్రప్రదేశ్ శాసన మండలి లో గవర్నర్ కోటాకు చెందిన రెండు సభ్యుల పదవీకాలం ముగియడంతో కొత్త నియామకాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పటివరకు ఈ స్థానాల్లో కొనసాగిన పండుల రవీంద్ర , జకియా ఖానం పదవీకాలం ముగియడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ( ఈ రెండు స్థానాలను భర్తీ చేసే అవకాశం ఉండటంతో పలువురు నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలోనే తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు, పార్టీ కోసం త్యాగం చేసిన వారు, సామాజిక సమీకరణాల్లో కీలక పాత్ర పోషించే నేతలు తమ పేర్లను పరిశీలించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు సమాచారం. సామాజిక వర్గాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.మిత్రపక్షాలకు ఈ స్థానాలను కేటాయించకుండా రెండింటినీ టీడీపీనే భర్తీ చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు రాజకీయ చర్చ సాగుతోంది. దీంతో పార్టీ అంతర్గతంగా పోటీ మరింత పెరిగింది. ఎవరికీ అవకాశం దక్కుతుందన్న అంశంపై నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది.ప్రస్తుతం అసెంబ్లీలో టీడీపీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. దీంతో ప్రభుత్వానికి అవసరమైన బిల్లులు సులభంగా ఆమోదం పొందుతున్నాయి. అయితే శాసన మండలిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి ప్రతి అంశంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. కొన్ని కీలక బిల్లులపై మండలిలో తీవ్ర చర్చలు జరగడంతో పాటు ప్రభుత్వానికి ఆశించిన ఫలితాలు రాకపోయిన సందర్భాలు కూడా ఉన్నాయిఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని కీలక బిల్లులు శాసన మండలిలో ఆశించిన విధంగా ఆమోదం పొందలేదు. పార్టీ నేత తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే ప్రతిపాదనతో తీసుకొచ్చిన బిల్లు మండలిలో నిలిచిపోయింది. అలాగే పీపీపీ విధానంలో కొన్ని మెడికల్ కాలేజీల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశం కూడా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామాలు మండలిలో ప్రభుత్వ వాదనను మరింత బలంగా వినిపించే నాయకుల అవసరాన్ని టీడీపీ ముందుకు తెచ్చాయి. అందుకే సభలో దూకుడుగా వాదించే, ప్రతిపక్ష విమర్శలకు సమర్థంగా సమాధానం చెప్పగల నాయకులను ముందుకు తీసుకురావాలనే ఆలోచనకు పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఈ వ్యూహంలో భాగంగానే శ్రీకాకుళం (కు చెందిన కావలి గ్రీష్మకు అవకాశం కల్పించారు. ఆమె పార్టీ తరఫున చురుకుగా వ్యవహరిస్తున్నప్పటికీ, మండలిలో మరింత దూకుడుగా వాదించే నాయకులు అవసరమనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమవుతోంది. అందుకే ఈసారి బలమైన వాక్చాతుర్యం కలిగిన, ప్రతిపక్షంపై సమర్థంగా ఎదురుదాడి చేయగల నేతలను ఎంపిక చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇదే సమయంలో సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలు, భవిష్యత్ రాజకీయ అవసరాలు వంటి అంశాలను కూడా టీడీపీ నాయకత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలుస్తోంది. పార్టీకి విధేయతతో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలనే అభిప్రాయం కూడా ఉంది. మొత్తంగా ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కేవలం నామినేషన్ ప్రక్రియ మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ వ్యూహాలకు కూడా కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. అందుకే తుది ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.శాసన మండలిలో ఖాళీ అయిన.. రెండు స్థానాలను భర్తీ చేసే విషయంపై టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు మౌనంగా ఉన్నారు. ఈ రెండు సీట్లు కూడా గవర్నర్ కోటాలో భర్తీ చేసేవే కావడం గమనార్హం. ప్రస్తుతం కూటమి సర్కారుకు గవర్నర్ అనుకూలంగానే ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి పెద్దగా ఎలాంటి ఇబ్బందులు ఉండే అవకాశం లేదు. దీంతో ఎవరిని ఎంపిక చేసినా ఇట్టే వారు మండలిలో కూర్చుంటారు. దీంతో నాయకులు మరిన్ని ఆశలు పెట్టుకున్నారు. గతంలో తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఎంపిక వివాదం అయింది. సుప్రీంకోర్టు వరకు సాగింది. అయితే.. ఇలాంటి వివాదాలు ఏపీలో కనిపించడం లేదు. దీంతో బాబు నిర్ణయమే ఫైనల్ అన్నట్టుగా ఉంది. ఇది నాయకుల్లో మరిన్ని ఆశలు రేకెత్తిస్తోంది. అయితే.. తాజాగా సీనియర్ నాయకులతో సచివాలయంలో చంద్రబాబు భేటీ అయినా.. ఈ విషయంపై ఆయన ఎక్కడా స్పందించలేదు. ఇది మరింతగా నాయకుల్లో టెన్షన్ పెంచుతోంది. ఇటీవల రాజ్యసభ ఎన్నిక ల సమయంలోనూ టీడీపీ కోటాలో ఎంపిక చేసేవారి పేర్లను ఇంతే గోప్యంగా ఉంచారు. ఫలితంగా ఆశలు పెట్టుకున్నవారు.. చివరి వరకు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూశారు. ఎంపిక ప్రక్రియ అయిపోయిన తర్వాత..ఆశలు పెట్టుకున్న అందరూ నిరుత్సాహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూడా బాబు బాంబు పేలుస్తారా? అనేది చర్చకు దారితీసింది. అలా వద్దని.. సడెన్‌గా పేర్లను వెల్లడిస్తే.. కేడర్‌లో చులకన అవుతున్నామని ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని, అయితే.. ఆ నిర్ణయమేదో సాధ్యమైనంత త్వరగా ప్రకటిస్తే.. కేడర్‌ను సంతృప్తి పరిచేందుకు.. తమ ఫ్యామిలీలను సంతృప్త పరిచేందుకు కూడా అవకాశం ఉంటుందని అంటున్నారు. మొత్తంగా ఈ విషయంపై టీడీపీలో చర్చ సాగుతోంది. కొందరు నాయకులు వస్తుందో రాదో అన్న బెంగతో తరచుగా ఫోన్లు కూడా చేస్తున్నారు. మరి చంద్రబాబు ఎ వరిని కరుణిస్తారో చూడాలి. ఏదేమైనా సడెన్‌గా కాకుండా ముందుగానే ప్రకటించాలని నాయకులు కోరుతున్నారు.

# రంగంలోకి రోజా

తిరుపతి, ఆగస్టు 1,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక కొత్త పరిణామం పార్టీ శ్రేణులకు గందరగోళపరుస్తోంది. ముఖ్యంగా చిత్తూరు జిల్లా రాజకీయాల్లో ఒక కుదుపు. మాజీ మంత్రి ఆర్కే రోజా మళ్లీ యాక్టివ్ కావడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. ఆమె సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. ఆమెను పక్కనపెట్టి బీసీ నేతకు అవకాశం ఇస్తారని ఇప్పటివరకు ప్రచారం జరిగింది. ఈ విషయంపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా అదే అభిప్రాయంతో ఉన్నారు. నగిరి నియోజకవర్గంలో రోజా అభ్యర్థిత్వం మార్పు చేయాలని ఆయన కోరుతూ వచ్చారు. ఎందుకంటే రోజా ఉంటే పెద్దిరెడ్డికి ఇబ్బందికరమే. ఒకవేళ వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీనియర్ మంత్రిగా పెద్దిరెడ్డి ఉంటారు. అదే జిల్లాలో రోజా మంత్రిగా ఉంటే తనకు ఇబ్బందికరమని పెద్దిరెడ్డికి తెలుసు. అందుకే మొన్నటి ఎన్నికల్లో రోజా అభ్యర్థిత్వాన్ని



వ్యతిరేకించారు పెద్దిరెడ్డి. కానీ జగన్ చివరి నిమిషంలో ఆమెకు చాన్స్ ఇచ్చారు. ఈసారి ఆమెను తప్పిస్తారన్న ప్రచారం జోరుగా సాగింది. కానీ ఇప్పుడు రోజాను మళ్లీ తెరపైకి తేవడంతో పెద్దిరెడ్డి తీవ్ర అనంతృప్తికి గురైనట్లు తెలుస్తోంది.ఇటీవల పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో పాటు ఆయన కుమారుడు మిథున్ రెడ్డి బిజెపిలో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. దానికి కారణం లేకపోలేదు. జగన్ స్థాయిలో పెద్దిరెడ్డి ఫ్యామిలీని టార్గెట్ చేసుకుంది కూటమి ప్రభుత్వం. అయితే ఇంతవరకు జగన్మోహన్ రెడ్డిని టచ్ చేయలేదు కానీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు మద్యం కుంభకోణంలో. అయితే ఈ పరిణామాలతో తీవ్ర కలత చెందారు పెద్దిరెడ్డి. మరోవైపు మద్యం కుంభకోణంలో అరెస్టై రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న సమయంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కనీసం జగన్మోహన్ రెడ్డి పరామర్శించిన దాఖలాలు లేవు. అప్పటినుంచి ఏర్పడిన గ్యాప్ అలానే విస్తరించింది. ఇప్పుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై అటవీ భూముల వ్యవహారం, ఆపై రెవెన్యూ రికార్డుల దహనం కేసు వెంటాడుతోంది. ఇన్ని అవమానాలు పడి జగన్మోహన్ రెడ్డి కోసం పార్టీలో ఉండాలా.. ఆపై తన ప్రత్యర్థి రోజాను ప్రోత్సహించడం ఎంత మాత్రం మింగుడు పడడం లేదు పెద్దిరెడ్డికి. అందుకే బిజెపిలోకి వెళ్లిపోవాలన్న నిర్ణయానికి ఆయన వచ్చినట్లు తెలుస్తోంది.గత కొంతకాలంగా పొలిటికల్ గా సైలెంట్ గా ఉన్నారు రోజా. ఆమెకు నగిరి టిక్కెట్ ఇచ్చేందుకు జగన్ వెనుకడుగు వేస్తున్నారు అన్న ప్రచారం నేపథ్యంలోనే ఆమె చెన్నైలో ఉండిపోయారన్న టాక్ నడిచింది.. క్రమేపీ ఆమె వైసీపీకి గుడ్ బై చెబుతారని కూడా ప్రచారం సాగింది. కానీ ఉన్నట్టుండి ఆమెను తిరిగి చిత్తూరు రాజకీయాల్లోకి తేవడం.. మరింత స్వేచ్ఛ ఇవ్వడం హాట్ టాపిక్ అవుతోంది. పెద్దిరెడ్డి పై ప్రోత్సహించేందుకే జగన్ ఆమెను తీసుకొచ్చినట్లు టాక్ నడుస్తోంది. ఒకవేళ బిజెపిలోకి పెద్దిరెడ్డి ఫ్యామిలీ వెళితే రోజా ఇప్పుడు ప్రత్యామ్నాయంగా చిత్తూరు జిల్లాలో నాయకత్వ బాధ్యతలు చూస్తారని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# వడివడిగా హైకోర్టు బెంచ్ ఏర్పాట్లు

కర్నూలు, ఆగస్టు 1, రాయలసీమ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి ఆకాంక్ష అయిన కర్నూలులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చేసిన ప్రకటన తీవ్ర ఆసక్తికరమైన చర్చకు తెరలేపింది. 90 రోజుల్లో కర్నూలులో హైకోర్టు బెంచ్ అందుబాటులోకి వస్తుందని ఆయన ప్రకటించారు. అయితే, ఒక రాష్ట్రంలో లేదా ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం అనేది కేవలం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలోని అంశం మాత్రమే కాదు. దీనికి సుదీర్ఘమైన రాజ్యాంగపరమైన, న్యాయపరమైన, పరిపాలనాపరమైన ప్రక్రియలు అవసరమవుతాయి. అందుకే 90 రోజుల గడువు సాధ్యమేనా? అసలు బెంచ్ ఏర్పాటు వెనుక ఉండే చట్టపరమైన క్రమం ఏమిటి? సాధారణంగా ఏదైనా రాష్ట్రంలో హైకోర్టుకు చెందిన ఒక ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయాలంటే ది స్టేట్ హైకోర్ట్స్ యాక్ట్ లేదా సంబంధిత పునర్వ్యవస్థీకరణ చట్టాల నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మొదట రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించాలి. అనంతరం, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమక్షంలోని ఫుల్ కోర్ట్ ముందుకు ఈ ప్రతిపాదన వెళుతుంది. హైకోర్టు ఫుల్ కోర్ట్ ఈ బెంచ్ ఏర్పాటుకు సాంకేతిక, మౌలిక వసతుల సాధ్యాసాధ్యాలను పరిశీలించి పూర్తి స్థాయిలో ఆమోదం తెలపాల్సి ఉంటుంది.హైకోర్టు ఫుల్ కోర్ట్ అంగీకారం తెలిపిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనను కేంద్ర న్యాయ శాఖ కు నివేదిస్తుంది. కేంద్ర ప్రభుత్వం దీనిని భారత ప్రధాన న్యాయమూర్తి , సుప్రీంకోర్టు కొలీజియం పరిశీలనకు పంపుతుంది. సుప్రీంకోర్టు సీజేఐ , కొలీజియం నుండి అనుమతి లభించిన తర్వాత మాత్రమే, కేంద్ర హోంశాఖ భారత రాష్ట్రపతి ఆమోదం కోసం ఫైలును పంపుతుంది. భారత రాజ్యాంగంలోని అధికరణ 214, సంబంధిత నిబంధనల ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చట్టబద్ధంగా రూపుదిద్దుకుంటుందిరాజ్యాంగపరమైన ఈ ప్రక్రియతో పాటు క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన అత్యంత ప్రధానమైనది. బెంచ్ నిర్వహణకు అవసరమైన తాత్కాలిక లేదా శాశ్వత భవనాలు, న్యాయమూర్తులకు నివాస సదుపాయాలు , కోర్టు హాళ్లు, రిజిస్ట్రీ సెక్షన్లు, అడ్వకేట్ రూమ్‌లు, పోలీస్ బందోబస్తు , డిజిటల్ నెట్‌వర్కింగ్ వంటి మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేయాలి. వీటితో పాటు అమరావతిలోని ప్రధాన హైకోర్టు నుండి కర్నూలు బెంచ్‌కు ఏ ఏ జిల్లాల


కేసుల అధికార పరిధి బదిలీ చేయాలనే దానిపై న్యాయ పరిపాలనా పరమైన స్పష్టత రావాల్సి ఉంటుందిఇంతటి సుదీర్ఘ ప్రక్రియ ఉన్నప్పటికీ మంత్రి నారా లోకేష్ 90 రోజుల గడువు విధించడం వెనుక కూటమి ప్రభుత్వ వ్యూహాత్మక ఆలోచన ఉందని రాజకీయ, న్యాయ విశ్లేషకులు భావిస్తున్నారు. కర్నూలులో ఇప్పటికే లోకాయుక్త వంటి న్యాయ సంస్థలకు ఉద్దేశించిన భవనాలు సిద్ధంగా ఉన్నందున, ప్రాథమికంగా తాత్కాలిక భవనంలో బెంచ్ కార్యకలాపాలు ప్రారంభించే వెసులుబాటును ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రంతో మంచి సఖ్యతతో ఉన్నందున, రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం త్వరితగతిన పూర్తి చేసి, సుప్రీంకోర్టు, హైకోర్టు సీజేల అనుమతుల ప్రక్రియను ఫాస్ట్ ట్రాక్ చేయాలనేది లోకేష్ వేసిన కచ్చితమైన ముందస్తు ప్రణాళికగా కనిపిస్తోంది. గతంలో బెంచ్ ఏర్పాటు ప్రక్రియలపై న్యాయవాదుల నిరసనలు, వినతులు జాప్యానికి కారణమైన ఆధారాలు ఉన్నాయి. అందువల్ల, 90 రోజుల్లో అన్ని రాజ్యాంగ ఆమోదాలు, రాష్ట్రపతి ఉత్తర్వులు పొందడం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో పరిపాలనాపరమైన క్లియరెన్సులను వేగవంతం చేస్తే, నిర్ణీత సమయంలో లేదా దానికి సమీప కాలంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ కల సాకారమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# ఫుల్ రేంజ్ లో లోకేష్ పాలిటిక్స్

విజయవాడ, ఆగస్టు 1, మంత్రి నారా లోకేష్.. ఫుల్ రేంజ్‌లో తన రాజకీయాలను విస్తరిస్తున్నారు. ఇటీవల కాలంలో పార్టీపై ఆయ న పట్టు పెంచుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు నక్సెస్ అవుతున్నాయి. నియోజకవర్గాలు, జిల్లాలు.. ఇలా ఎక్కడ ఎప్పుడు ఏది అవసరమో గుర్తించి.. దానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. ఒకవైపు పాలన చూసుకుంటూ.. మరోవైపు.. పార్టీ పనుల్లోనూ బిజీబిజీగా గడుపుతున్నారు. తాజాగా కర్నూల్లో నిర్వహించిన సమావేశం లోకేష్ దూకుడుకు పక్కా రియాక్షన్ ఇచ్చింది.=పార్టీ కార్యక్రమాలకు ఇటీవల కాలంలో దూరంగా ఉంటూ వచ్చిన వారు కూడా.. తాజాగా లోకేష్ వస్తున్నారని తెలిసిన వెంటనే నాయకులు క్యూకట్టారు. అప్పటి వరకు ఉన్న విభేదాలను కూడా కొందరు నాయకులు దూరం పెట్టి చేతులు కలిపారు. లోకేష్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు భేషజాలకు పోకుండా చేతు లు కలిపారు. ఇది.. పార్టీలో ఐక్యతకు నిదర్శనంగా మారిందని సీనియర్లు చెబుతున్నారు. నిజానికి కొన్నాళ్లుగా కర్నూలు తమ్ముళ్ల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ం. నిజానికి టీడీపీలో తరం మారుతున్న సంధికాలంలో నాయకుల పరిస్థితి.. అధిష్టానం ఆలోచనలు వంటివి ప్రత్యేకంగా చర్చకు వస్తున్నాయి. చంద్రబాబుకు లోకేష్‌కు మధ్య వ్యత్యాసం.. దూకుడు వంటివి నాయకుల మధ్య ఆలోచనలను మారుస్తున్నాయి. చంద్రబాబు అయితే.. చెప్పింది వింటారు.. బుజ్జగిస్తారు.. సమయం ఇస్తారు.. అనే భరోసా ఉంటుంది. దీంతో తప్పులు చేసిన నాయకులు కూడా వివరణ, విచారణలతో ఏదో ఒకరకంగా బయట పడుతున్నారు.కానీ, లోకేష్ విషయానికి వస్తే.. ఆయన దగ్గర ఇలాంటి కుదరడం లేదు. దీనికి అనేక ఉదాహరణలు కూడా ఉన్నాయి. మైలవరం నుంచి పెనమలూరు వరకు.. పలు నియోజకవర్గాల్లో చోటు చేసుకున్న వివాదాలను లోకేష్ తనదైన శైలిలో పరిష్కరించారు. ఆయనేమీ సాగదీత ధోరణికి చాన్స్ ఇవ్వరు. ఫటాఫట్.. అన్నట్టు గా నాయకులతో మొహంమీదే మాట్లాడేస్తున్నారు. దీంతో నాయకుల మధ్య ఐక్యత పెంచేందుకు.. పార్టీని లైన్‌లో పెట్టేందుకు ఈ పరిణామాలు దోహదపడుతున్నాయి. ఇదే ఇప్పుడు కర్నూలులో నాయకులు తిరిగి కలుసుకునేందుకు అవకాశం కల్పించిందని అంటున్నారు.

# భువనేశ్వరి ఆగ్రహం...

తిరుపతి, ఆగస్టు1, నారా భువనేశ్వరి గత మూడు రోజుల నుంచి కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. అయితే నారా భువనేశ్వరి ఎప్పుడూ రాజకీయాలు మాట్లాడరు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు దాదాపు నాలుగు సార్లు ఎన్నికయినప్పటికీ నారా భువనేశ్వరి పాలన వ్యవహారాల్లోనూ, రాజకీయాల్లోనూ ఆమె జోక్యం కనపడదు. కేవలం కుటుంబ బాధ్యతలతో పాటు తాను నిర్వహిస్తున్న హెరిటేజ్ వంటి పరిశ్రమలకు సంబంధించిన వ్యవహారాలను మాత్రమే చూస్తున్నారు. నారా భువనేశ్వరి పక్కా బిజినెస్ ఉమెన్. అయితే ఎన్నికల సమయంలో మాత్రం కేవలం కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తారు. అంతే తప్ప ఎటువంటి రాజకీయ వ్యవహారాలను నారా భువనేశ్వరి పట్టించుకోరు... నారా భువనేశ్వరిలో కోపం కనిపించదు. మృదుస్వభావి. అందరినీ నవ్వుతూ పలకరిస్తారు. అమ్మగా ఆమెను ఆప్యాయతను పంచుతారు. అలా చంద్రబాబుతో సమానంగా కుప్పం నియోజకవర్గ ప్రజలకు చేరువయ్యారు. నారా భువనేశ్వరి మాత్రమే కాదు లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి కూడా రాజకీయాలను అస్సలు పట్టించుకోరు. వారు కుటుంబం, వ్యాపారాలకే పరిమితమై హైదరాబాద్ లోనే ఉంటున్నారు. అలాంటి నారా భువనేశ్వరి కి కోపం వచ్చింది. ఒక్కసారిగా ఆవేదన ఉప్పొంగింది. కుప్పం నియోజకవర్గం పర్యటనలో ద్రౌపది చిత్రపటాన్ని చూసి నారా భువనేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు. కుప్పం పర్యటనలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నారా భువనేశ్వరి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనను అసెంబ్లీలో అవమానించారని... అసెంబ్లీలో తనను నిందు సభలో అవమానించారని,



ఆ సంఘటన మహాభారతంలో ద్రౌవది వస్త్రాపహరణాన్ని తలపించిందని కంటతడి పెట్టుకున్నారు. కౌరవులు సభలో ద్రౌపదిని అవమానించినట్టుగానే, గత పాలకులు రాజకీయ లబ్ధి కోసం తన చరితను హేళన చేశారని మండిపడ్డారు. తన భర్తకు తానేంటో తెలుసునని, తన భర్త చంద్రబాబుకు బాగా తెలుసునని , ఏ మహిళపై వ్యక్తిగత విమర్శలు చేసే హక్కు ఎవరికీ లేదని నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. రాజకీయాల్లో పోరాటాలు ఎవరిపై చేయాలన్నా చేసుకోవచ్చు కానీ, ఇళ్లలోని స్త్రీలను లాగి అవమానించడం అత్యంత హేయమని ఆవేదన వెలిబుచ్చారు. మగ అహంకారంతో గత ప్రభుత్వంలో వ్యవహరించి తనను హేళన చేయడాన్ని ఆమె గుర్తు చేసుకుని బాధపడ్డారు. ఇది రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది.

# వీర మహిళలకు పెద్ద పీట....

కాకినాడ, ఆగస్టు 1, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. పార్టీ పదవుల్లోనూ, ఇకపై ప్రభుత్వ నియామకాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా పార్టీ పదవులపై కసరత్తుచేస్తున్న పవన్ కల్యాణ్ జనసేనలో మహిళలకు ప్రాధాన్యత తక్కువగా ఉందని గుర్తించారు. అలాగని జనసేనలో మహిళనేతలకు కొదవలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక మహిళకు మాత్రమే అవకాశం ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో కొందరికి కట్టబెట్టినా వారు పెద్దగా హైలెట్ కాలేదు. అందుకే ఈసారి పార్టీ పదవుల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయించినట్లు తెలిసింది. నేతలు ఏదో ఒక వివాదంలో చిక్కుకోవడం పవన్ కల్యాణ్ కు ఇబ్బందిగా మారింది. అదే మహిళలయితే పార్టీ కోసం, తన మాటకు కట్టుబడి నియోజకవర్గంలో పనిచేస్తారని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినా, ముందుగా పార్టీ పదవుల్లో వారికే అగ్రతాంబూలం ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయినట్లు తెలిసింది. నియోజకవర్గాల ఇన్ ఛార్జుల విషయంలో జరుపుతున్న కసరత్తులో మహిళ పేర్లను ఎక్కువగా పవన్ పరిశీలిస్తున్నారని అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మహిళ రిజర్వేషన్లు కూడా అమలు కానుండటంతో పాటు మహిళలయితే వివాదాలకు దూరంగా ఉంటారని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జనసేనలో వీర మహిళలకు ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ వీర మహిళలున్నారు. వారిలో బలమైన సామాజికవర్గం, ఆర్థిక పరిస్థితులను చూసిన తర్వాత పార్టీ పదవులకు ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లా అధ్యక్షులుగా కూడా ఎక్కువ మంది మహిళలకు అవకాశమిస్తే తమకు రాజకీయంగా మైలేజీ దొరకడమే కాకుండా, ఇబ్బందులు కూడా ఉండవని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అనేక జిల్లాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు నాయకత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయకపోవడంతో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పార్టీ కార్యవర్గాన్ని అప్పట్లో రద్దు చేశారు. ఇప్పుడు దాదాపు అన్ని పదవులు రద్దయ్యాయి. అలాగే పార్టీ అధికార ప్రతినిధులుగా మహిళలకే చోట కల్పించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి

# లక్ష కోట్లతో పీపీపీలు... నెంబర్ వన్

విజయవాడ, ఆగస్టు 1భారతదేశంలో మౌలిక వసతుల విప్లవాత్మక అభివృద్ధి కోసం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రూపొందించిన పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాజెక్టుల పైప్‌లైన్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశంలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆర్థిక వ్యవహారాల శాఖ విడుదల చేసిన అధికారిక వివరాల ప్రకారం రాష్ట్రాల వారీగా పిలిచిన ప్రతిపాదిత పీపీపీ ప్రాజెక్టుల విలువ, సంఖ్య పరంగా ఏపీ అగ్రభాగాన నిలిచింది. రాష్ట్రంలో ఏకంగా రూ. 1,15,578.81 కోట్ల అంచనా వ్యయంతో 270 మౌలిక వసతుల ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నట్లు కేంద్రం తన నివేదికలో స్పష్టం చేసింది.దేశవ్యాప్తంగా మొత్తం రూ. 17 లక్షల కోట్లకు పైగా విలువైన 852 ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ఒకే గొడుగు కిందకు తెచ్చి, ప్రైవేట్ పెట్టుబడిదారులకు స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించింది. ఈ జాబితాలో తమిళనాడు రూ. 87,639.65 కోట్ల విలువైన 70 ప్రాజెక్టులతో రెండో స్థానంలో నిలవగా, మధ్యప్రదేశ్ రూ. 65,496.50 కోట్లతో 21 ప్రాజెక్టులతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ చాలా ముందంజలో ఉంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామికాభివృద్ధి, రోడ్లు, పోర్టులు, ఇంధన రంగం మరియు పట్టణాభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయడంపై దృష్టి సారించింది. పీపీపీ విధానం ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ ప్రతిపాదనలను వేగంగా సిద్ధం చేసి కేంద్ర సమ్మతిని పొందింది.



# స్పోర్ట్స్ న్యూస్

## కామన్వెల్త్ గేమ్స్ 2026 విజేతలను ప్రశంసించిన ప్రధాని మోదీ




కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ అథ్లెటిక్స్ దూసుకెళ్తున్నారు. ఇప్పటి వరకు ఐదు స్వర్ణాలు, 12 రజతాలు, 6 కాంస్యాలతో మొత్తం 23 పతకాలు భారత్ ఖాతాలో ఉన్నాయి. ఇక కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు పతకాలు అందించిన అథ్లెట్లను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. జావెలిన్ త్రోలో రజతం గెలిచిన నీరజ్ చోప్రా, కాంస్య పతక విజేత యశ్వీర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.'గ్లాస్గో వేదికగా కామన్వెల్త్ గేమ్స్‌లో నీరజ్ చోప్రా అద్భుతం చేసి.. రజత పతకం అందుకున్నాడు. మెడల్ సాధించే క్రమంలో నిలకడ, సంయమనం, స్ఫూర్తిని ప్రదర్శించాడు. ఇదే ఆత్మవిశ్వాసంతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. యశ్వీర్‌కు శుభాకాంక్షలు. అద్భుతంగా త్రో చేసి.. పతకం సాధించావు. ఆటపై నీకున్న ఆసక్తి, నిబద్ధతకు ఇదే నిదర్శనం. ఈ విజయంతో యువ అథ్లెట్లకు స్ఫూర్తిగా నిలిచావు' అని మోదీ పోస్ట్ చేశారు.అలానే ఇతర విభాగాల్లో మెడల్స్ సాధించిన యామిని మౌర్య, తేజశ్విన్ శంకర్‌కు ప్రధాని మోదీ విషెష్ తెలిపారు. 'జూడో 57 కేజీల విభాగంలో రజతం నెగ్గిన యామిని మౌర్య, డెకథ్లాన్ ఈవెంట్‌లో కాంస్యం సాధించిన శంకర్‌కు శుభాకాంక్షలు. జూడో పట్ల యామిని అభిరుచి అభినందనీయం. ఎక్కువ మంది యువత జూడో వైపు వచ్చేందుకు మౌర్య విజయం బాటలు వేస్తుంది. ఇక పది ఈవెంట్లలో ఆల్ రౌండర్ ప్రదర్శన చేసిన తేజశ్విన్ కష్టానికి ప్రతిఫలం దక్కింది. భవిష్యత్తులోనూ ఇలానే కొనసాగాలని ఆశిస్తున్నాను' అని ప్రధాని మోదీ తెలిపారు.

## భవిష్యత్తులో వైభవ్ సూర్యవంశీ కెప్టెన్ అవుతాడేమో: ఈస్ట్ జోన్ సెలెక్టర్





దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ జట్టుకు భారత యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంపై వస్తోన్న విమర్శలకు ఆ జట్టు సెలెక్టర్ ప్రవంజన్ మల్లిక్ సమాధానమిచ్చారు. జట్టు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. వైభవ్ భవిష్యత్తులో కెప్టెన్ కూడా అవుతాడని అభిప్రాయపడ్డారు. స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్న ఈస్ట్ జోన్ జట్టుకు వైభవ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే. అయితే 15 ఏళ్ల వయసులోనే ఇంత పెద్ద బాధ్యత ఇవ్వడం సరైన నిర్ణయం కాదంటూ సోషల్ మీడియాలో పలువురు మాజీ క్రికెటర్లు, అభిమానులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.'వైభవ్‌ను కెప్టెన్‌గా నియమించలేదు. వైస్ కెప్టెన్ మాత్రమే. కెప్టెన్ ఇషాన్ కిషన్ వికెట్ కీపర్ కావడంతో రోజంతా మైదానంలో చురుకుగా ఉంటాడు. వైభవ్ మొత్తం మ్యాచ్‌కు నాయకత్వం వహించాల్సిన పరిస్థితి ఉండదు. చిన్న వయసులోనే బాధ్యతలు ఇవ్వడం అతడిని మరింత పరిణతి చెందిన ఆటగాడిగా తీర్చిదిద్దుతుంది. దేశం కోసం బాగా ఆడాలనే తపన వైభవ్‌లో ఉంది. యువ ఆటగాళ్లకు బాధ్యతలు అప్పగించడం చాలా ముఖ్యం. అందుకే ఈ అవకాశాన్ని కల్పించాం. వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో కెప్టెన్ అవుతాడేమో! అతడి ప్రతిభ అసాధారణం. వైభవ్ ఇప్పటికే బిహార్ ఫస్ట్‌క్లాస్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాన్ని చెప్పే హక్కు ఉంది. వాటిని మేము గౌరవిస్తాం. అయితే జట్టుకు ఏది మంచిదో అదే చేశాం. ఇది సెలక్షన్ కమిటీ సభ్యులందరూ కలిసి తీసుకున్న నిర్ణయం' అని ప్రవంజన్ స్పష్టం చేశారు.కాగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈస్ట్ జోన్ సెలక్షన్ కమిటీ సమావేశంలో ప్రవంజన్ మల్లిక్‌తో పాటు దిబ్యేందు చక్రవర్తి, మనీష్ వర్ధన్, అలోక్ సాహా, అనంత్ ప్రకాశ్ పాల్గొన్నారు. అయితే ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఈ దులీప్ ట్రోఫీ జరగనుంది. కాగా ఈస్ట్ జోన్ జట్టు తన తొలి మ్యాచ్‌ను నార్త్ జోన్‌తో ఆడనుంది.

## ఇంగ్లండ్ గడ్డపై అదరగొడుతున్న ఢిల్లీ ఆల్ రౌండర్

లండన్: ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆల్ రౌండర్ ఆశుతోష్ శర్మ ఇంగ్లండ్ గడ్డపై అదరగొడుతున్నాడు. అక్కడి వన్డే కప్‌లో హ్యాంప్‌షైర్‌కు అశుతోష్ 4 మ్యాచుల్లో 13 వికెట్ల పడగొట్టాడు. ఇంగ్లండ్‌లోని వైవిధ్యభరితమైన పిచ్‌లపై తన మిడియం పేస్ బౌలింగ్‌తో బ్యాటర్లకు చుక్కలు చూపిస్తున్నాడు. తాజాగా ఎసెక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 5 వికెట్ల ప్రదర్శనతో సత్తా చాటాడు. దీనికి ముందు మ్యాచ్‌లో ఓ వికెట్ తీసిన అశుతోష్ అంతకు ముందు మ్యాచ్‌లో 4 వికెట్లు, దానికి ముందు మ్యాచ్‌లో మూడు వికెట్లు పడగొట్టాడు. ఈ ప్రదర్శనలతో అశుతోష్ ఈ సీజన్‌లో హ్యాంప్‌షైర్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అయితే బ్యాటింగ్‌లో మాత్రం తేలిపోతున్నాడు. 4 మ్యాచ్‌ల్లో కేవలం 37 పరుగులు మాత్రమే చేశాడు. భారీ హిట్టింగ్ చేసే సామర్థ్యం ఉన్నప్పటికీ.. ఒకటి రెండు మెరుపులతో సరిపెట్టాడు. ఈ టోర్నీలో అశుతోష్ స్కోర్లు వరుసగా 10, 0, 11, 16 పరుగులుగా ఉన్నాయి.





## భారత్ ఖాతాలో మరో రెండు పసిడి పతకాలు




గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ ఖాతాలో మరో రెండు స్వర్ణాలు చేరాయి. ఇవాళ బాక్సింగ్ విభాగంలో భారత్ ఈ రెండు పసిడి పతకాలను సాధించింది. తొలుత మహిళల 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ గోల్డ్ మెడల్ గెలిచింది. తుదిపోరులో కెనడాకు చెందిన స్కార్లెట్ సవన్నా డెల్గాడోను ప్రీతి చిత్తుగా ఓడించింది. అనంతరం మహిళల 57 కేజీల విభాగంలో జైస్మిన్ లాంబోరియా భారత్ కు పసిడిని అందించింది. ఫైనల్ లో నార్తర్మ్ ఐర్లాండ్ కు చెందిన మైఖేలా వాల్ష్ పై జైస్మిన్ విజయం సాధించింది.

## కామన్వెల్త్ గేమ్స్: ఆ జ్ఞాపకాలు మళ్లీ గుర్తొచ్చాయి.. నీరజ్ చోప్రా భావోద్వేగం




కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా రజత పతకం కైవసం చేసుకోవడంపై స్పందించాడు. తనతో పాటు భారత అథ్లెట్ యశ్వీర్ సింగ్ కూడా పోడియంపై నిలవడం తనకెంతో ఆనందంగా అనిపించిందని తెలిపాడు. ఈ విజయం తనకు ఆసియా క్రీడలను గుర్తు చేసిందని తెలిపాడు. కాగా ఈ టోర్నీలో నీరజ్ చోప్రా రజతం సాధించగా.. యశ్వీర్ సింగ్ అద్భుత ప్రదర్శనతో కాంస్యం నెగ్గిన సంగతి తెలిసిందే.'ఆసియా క్రీడల్లో నేను, సౌరవ్ ఇద్దరం పతకాలు గెలిచాం. ఇప్పుడు ఆ సందర్భం మళ్లీ గుర్తొచ్చింది. యశ్వీర్ అత్యంత కీలక సమయంలో వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేయడం గొప్ప విషయం. ఇద్దరం కలిసి పోడియంపై నిలవడం ఆనందంగా ఉంది. జాతీయ గీతం వినిపించే ప్రతి క్షణం ప్రత్యేకమే. గాయం నుంచి కోలుకుని సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగా. నా పునరాగమనం సరైన దిశలోనే సాగుతోంది. ఇంకా చాలా పోటీలు ఉన్నాయి. నా ప్రదర్శనను మెరుగుపరుచుకుంటా. ఇప్పటి వరకు నా ఆటపై సంతృప్తిగా ఉన్నా' అని నీరజ్ పేర్కొన్నాడు.తొలి అంతర్జాతీయ పతకం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని యశ్వీర్ వెల్లడించాడు. 'పోటీ ఆరంభంలో అనుకున్నంత సులువుగా సాగలేదు. ఒక దశలో నా త్రో 81.3 మీటర్ల వద్దే ఉంది. కాంస్య పతకానికి 82 మీటర్లు సరిపోతాయని చూసిన తర్వాత నాకు నమ్మకం వచ్చింది. చివరి ప్రయత్నంలో పూర్తి స్థాయిలో విసరాలని నిర్ణయించుకున్నా. అదే నాకు పతకాన్ని అందించింది. కుటుంబ సభ్యులు, కోచ్‌లు, నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఈ విజయం అంకితం' అని యశ్వీర్ తెలిపాడు.

## పాకిస్థాన్ క్రికెటర్‌ను హత్తుకున్న జెమిమా రోడ్రిగ్స్..




భారత మహిళా స్టార్ క్రికెటర్ జెమిమా రోడ్రిగ్స్.. పాకిస్థాన్ క్రికెటర్ ఫాతిమా సనాను హత్తుకుంది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ది హండ్రెడ్ లీగ్ టోర్నీలో భాగంగా సదర్న్ బ్రేవ్, బర్మింగ్‌హామ్ ఫినిక్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మ్యాచ్ ముగిసిన తర్వాత ఇరు జట్ల ప్లేయర్లు పరస్పరం అభినందించుకుంటుండగా, జెమిమా- ఫాతిమా ఒకరినొకరు పలకరించుకుని ఆలింగనం చేసుకున్నారు. 2025లో పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన సంగతి తెలిసిందే. ఆసియా గేమ్స్ నాటి నుంచి ఇరు జట్ల ప్లేయర్లు షేక్‌హ్యాండ్ కూడా ఇచ్చుకోవడం మానేశారు. ఈ క్రమంలో ఫాతిమా సనాను జెమిమా హగ్ చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ముందుగా బ్యాటింగ్ చేసిన సదర్న్ బ్రేవ్.. 100 బంతుల్లో 3 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. లిజెల్ లీ (43), మాయా బూషియర్ (45) రాణించగా, జెమిమా రోడ్రిగ్స్ 18 బంతుల్లో 28 పరుగులతో అజేయంగా నిలిచింది. బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ తరఫున ఫాతిమా సనా మూడు సెట్ల (15 బంతులు) బౌలింగ్‌లో 33 పరుగులు ఇచ్చింది. 141 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బర్మింగ్‌హామ్ ఫీనిక్స్‌కు టామీ బీమాంట్ (22), డవీనా పెరిన్ (52) శుభారంభం అందించినా, ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయింది. నిర్ణీత 100 బంతుల్లో 5 వికెట్లకు 116 పరుగులకే పరిమితమైంది. దీంతో సదర్న్ బ్రేవ్ 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ సీజన్‌లో వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేయగా, బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ ఇంకా గెలుపు ఖాతా తెరవలేదు.

## ప్రైవేటు పెట్టుబడి ప్లాన్‌ను రద్దు చేసిన ఫిఫా

న్యూయార్క్: ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ అసోసియేషన్(కీలక నిర్ణయం తీసుకున్నది. ఫిఫాలో వాటాలను ప్రైవేటు పెట్టుబడిదారులకు అమ్మాలన్న నిర్ణయాన్ని రద్దు చేసినట్లు అధ్యక్షుడు గియాన్ని ఇన్‌ఫాంటినో తెలిపారు.



సుమారు 20 శాతం వాటాలను అమ్మి దాదాపు 402 కోట్ల డాలర్లను ఆర్జించాలని ఫిఫా భావించింది. కానీ ప్రణాళికకు ఫుట్‌బాల్ సమాఖ్యల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఫిఫాలోని సభ్య దేశాలు ప్రైవేటు పెట్టుబడులను వ్యతిరేకించాయి. ప్రపంచకప్‌తో పాటు పలు రకాల ఈవెంట్లను ఫిఫా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వ్యతిరేకత ఎక్కువ కావడం వల్ల వివాదాస్పద ప్లాన్‌ను రద్దు చేస్తున్నట్లు గియాన్ని ఇన్ఫాంటినో తెలిపారు.తాము అనుకున్న ప్రాజెక్టుపై భిన్నాభిప్రాయలు వచ్చాయని, దీంతో విభజన ఏర్పడిందని, తమ లక్ష్యాలు నెరవేరడం లేదు కాబట్టి, ఆ పెట్టుబడి ప్లాన్‌ను రద్దు చేసినట్లు ఫిఫా అధ్యక్షుడు చెప్పారు. ఫిఫాలో మొత్తం 211 సభ్య దేశాలు ఉన్నాయి. అయితే ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌కు ఓకే చెబితే ఆయా దేశాలకు 40 మిలియన్ల డాలర్లు ఇస్తామని ఇన్‌ఫాంటినో ఆఫర్ చేశారు. మహిళల, పురుషుల ప్రపంచకపల్లో ప్రైవేటు ఇన్వెస్టర్లకు అవకాశం కల్పించేందుకు ప్లాన్ చేశారు. కానీ యురోపియన్ ఫుట్‌బాల్ సంఘం యూఈఎఫ్ఏ ఆ ప్లాన్‌ను వ్యతిరేకించింది. ఒకవేళ ఆ ప్రణాళిక అమలు చేస్తే తాము వరల్డ్‌కప్‌ను నిషేధిస్తామని అన్నారు.

# ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలి

## మారెళ్లపాడు పంప్ హౌస్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 01 తెలంగాణ పవర్ : అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడు పంప్ హౌస్ వద్ద కొనసాగుతున్న నిర్మాణ వనులను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పంప్ హౌస్ వద్ద జరుగుతున్న పంపుల ఏర్పాటు( వంపు ఎరక్షన్)వనుల పురోగతిని పరిశీలించి, పనులు నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్ ప్రతినిధులను ఆదేశించారు. అనంతరం ప్రధాన పంప్ హౌస్‌లో మోటార్ల కప్లింగ్ పనులను పరిశీలించి, సాంకేతిక ప్రమాణాలను పాటిస్తూ ఎలాంటి లోపాలు లేకుండా పనులు చేపట్టాలని



సూచించారు.అలాగే ప్రెషర్ మెయిన్ పైప్‌లైన్ ఏర్పాటు పనుల పురోగతిని పరిశీలించి, పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రెషర్ మెయిన్ , తుమ్మల చెరువు ఫీడర్ కాలువ కలిసే ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలించి, ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ప్రాజెక్టు పూర్తయితే ఆయకట్టు రైతులకు సాగునీటి అందుబాటు మెరుగుపడి వ్యవసాయానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్ ప్రతినిధులు, మండల అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

## -ఎస్సీ కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం

జహీరాబాద్ ఆగస్టు 1: తెలంగాణ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అనిశ్చితిలో పడిందని, రెండు సంవత్సరాలకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం అన్నారు. ఫలితంగా అనేక ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేస్తు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికేట్లు ఇవ్వకుండా మానసికంగా వేదిస్తున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులను,కళాశాలలను ఈ సంక్షోభం నుంచి బయటపడేలా చర్యలు తీసుకోవాలన్నారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.7వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ



పరిస్థితి వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు కోల్పోతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేసిన కళాశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్లు అందేలా ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ఆదేశాలు జారీ చేయాలని, బీఆర్ఎస్ పార్టీ విద్యార్థులకు అండగా ఉండి వారి హక్కుల కోసం ఎల్లప్పుడూ పోరాడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి,రాంచంద్రారెడ్డిలు ఉన్నారు.

# గోదావరి వరదల ఉధృతి నేపథ్యంలో ప్రజలు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 01 తెలంగాణ పవర్ : గోదావరి వరదల ఉధృతి నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని నెల్లిపాక బంజార, రామచంద్రాపురం గ్రామాల్లో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వరద ప్రభావిత ప్రాంతాలను శనివారం ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా వరద పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గ్రామాల్లోని పరిస్థితులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరదల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేవట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద



ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని, వరద బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు కట్టుబడి ఉందని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో ఉద్రిక్తత

**- ధాన్యం బకాయిల కోసం బీజేపీ ఆందోళన**

**- బీజేపీ నేతల అరెస్టు**

**- అస్వస్థతకు గురైన సిరికొండ శ్రీనివాస్**

వేములవాడ, ఆగస్టు 1: రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం వేములవాడలో నిర్వహించిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. చెక్కపల్లి బస్టాండ్ సమీపంలో ధర్నా చేపట్టిన నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై వడ్లు పోసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ప్రధాన రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు జోక్యం చేసుకుని పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతుల హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతుంటే అక్రమ అరెస్టులకు పాల్పడ్డారని బీజేపీ నాయకులు ఆరోపించారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఆందోళన సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోవడంతో పార్టీ నాయకులు ఆయనను వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

మరోవైపు, తమ కార్యకర్తలపై పోలీసులు అనవసరంగా బలప్రయోగం చేశారని ఆరోపిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి నేతృత్వంలో నాయకులు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ధాన్యం బకాయిల అంశంపై జరిగిన ఈ పరిణామాలతో శనివారం వేములవాడలో రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది.



# పుట్టిన బిడ్డకు మొదటి టీకా తల్లిపాలు

## బిడ్డకు తల్లిపాలు సంపూర్ణ ఆహారం

## జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. కృష్ణ

తెలంగాణ పవర్ (ఆగష్టు- 01) నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి : గర్భవతి ప్రసవించిన వెంటనే పుట్టిన బిడ్డకు ఒక గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వడం ఒక టీకా తో సమానం, బిడ్డకు ఆరు నెలల వరకు నీళ్ల విరోచనాలు ,

న్యూ మోనియా తదితర అంటూ వ్యాధులు రాకుండా కాపాడుతాయి అని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. కృష్ణ తెలిపారు.

శనివారం నాడు ప్రపంచ తల్లి పాల వారోత్సవం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గర్భవతులకు, బాలింతలకు అవగాహన సమావేశము నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే.కృష్ణ మాట్లాడుతూ గర్భవతి ప్రశ్నించిన తర్వాత పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు పట్టించాలని, ఎట్టి పరిస్థితులు తేనే, చక్కెర,గ్లూకోస్ నీరు లాంటి ఇతర పానీయాలు ఇవ్వవద్దని, తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆహారం,

మొదటి మూడు రోజుల తల్లిపాలలో ( ముర్రు పాలు) బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరగడానికి దోహదపడుతుంది. బిడ్డ పుట్టిన 48 గంటల తర్వాత కొంతమంది పిల్లలు వచ్చే ఫిజిలాజికల్ జాండీస్ తీవ్రత తగ్గుతుంది.

తల్లి బిడ్డకు మధ్య అనుబంధం పెరుగుతుంది,

బిడ్డలు భద్రత భావం పెరుగుతుంది.బిడ్డకు మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే




ఇవ్వాలి, తల్లిపాలు ఇవ్వడం వలన బిడ్డకు భవిష్యత్తులో అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం బారిన పడకుండా నివసించగలుగుతాం,

ఆరు నెలల తర్వాత అదరపు ఆహారాన్ని తల్లిపాలతో పాటు ప్రారంభించాలి.

తల్లిపాలు ఇవ్వడం వలన తల్లికి అండాశయ మరియు బ్రెస్ట్ క్యాన్సర్, ఎముకలు పేలుసు బారడం(ఆస్టియో పోరోసిస్) తదితర అనారోగ్య సమస్యల బారిన పడరు.

తొందరగా బరువు తగ్గుతారు. ఆరు నెలల వరకు మళ్లీ గర్భం దాల్చకుండా గర్భం నిరోధకంగా ఉపయోగపడుతుంది

అని డి ఎం హెచ్ ఓ గారు అవగాహన

కలిగించారు.

తదనంతరం జిజిహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ సౌమ్య బాలింతల్లో పాలు బాగా రావడానికి తీసుకోవలసిన ఆహారము, ఇంత పరిమాణము లో నీరు తీసుకోవాలో తదితర విషయాల గురించి అవగాహన కలిగించారు.

ఈ కార్యక్రమంలో జిజిహెచ్ ఆర్ ఎం ఓ డాక్టర్ రవి శంకర్, డాక్టర్ అజీజ్, పీడియాట్రిషన్ డాక్టర్ సిరాజుద్దీన్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆర్ సురేష్ బాబు, డాక్టర్ కె రవికుమార్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, వైద్య అధికారి డాక్టర్ సృజన, ఇంచార్జ్ సిడిపిఓ

నాగర్ కర్నూల్ శోభారాణి, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాల చారి, డిపిఓ రేనయ్య, ఎపీ ఓ లు బాదం రాజేశ్వర్, కోట్రనిరంజన్, డివి ఎల్ ఎం కుమార్, దివ్య, సూపర్వైజర్ మరియమ్మ, ఏఎన్ఎం నర్సింగమ్మ, హెల్త్ అసిస్టెంట్ తాళ్ల యాదగిరి, ఆశా కార్యకర్తలు మరియు అంగన్వాడీ టీచర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు

# జహీరాబాద్ మండలంలో 96 శాతం సర్ పూర్తి

## -కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి

జహీరాబాద్, ఆగస్ట 1: జహీరాబాద్ మండలంలో 96 శాతం ఎన్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పి.నరసింహారెడ్డి తెలిపారు. జహీరాబాద్ మండల అధ్యక్షుడి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. అన్ని గ్రామాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి ఈప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో సహకరించిన బీఎల్ఓలు, బీఎల్ఎలు సూపర్వైజర్లు,అన్ని గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు,పార్టీ నాయకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇంకా మిగిలి ఉన్న శాతాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్,



జిల్లా అధ్యక్షురాలు నిర్మలా రెడ్డి,పార్లమెంటు సభ్యులు సురేష్ శెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ వైర్మన్ గిరిధర్‌రెడ్డి,జహీరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చంద్రశేఖర్ మరియు రాష్ట్ర పార్టీ నాయకులు ఉజ్వల్‌రెడ్డిల ఆదేశాల మేరకు జహీరాబాద్ మండలంలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినట్లు నరసింహారెడ్డి స్పష్టం చేశారు. అలాగే, ఓట్ల తొలగింపు ప్రక్రియకు సంబంధించి గాంధీభవన్ నుంచి వచ్చిన తాజా మార్గదర్శకాలను ఆయన ప్రస్తావించారు. ప్రక్రియకు ఇంకా గడువు ఉన్నందున ఓట్ల తొలగింపు డిలీషన్‌ఫారాలపై పార్టీ నిర్ణయించిన బిఎల్ఏలు ఇప్పుడే ఎలాంటి సంతకాలు చేయవద్దని ఆయన స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ యంపిపి రాములు,మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఇమామ్ పటేల్,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి,కిసాన్ సెల్ అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిలీప్, ఖాసింపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, యూత్ కాంగ్రెస్ హుగ్గెల్లి అధ్యక్షుడు రాజు, సీనియర్ నాయకులు నర్సింహులు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సినిమా

## అమెజాన్ ప్రైమ్‌లో 'పోలీస్ కంప్లైంట్' మూవీ



హారర్-యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న 'పోలీస్ కంప్లైంట్' చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. జూన్‌లో థియేటర్లలో విడుదలై మంచి స్పందనతో పాటు సానుకూల సమీక్షలు అందుకున్న ఈ చిత్రం, ఈ శుక్రవారం (జూలై 31) నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో తెలుగు, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది.

తెలుగు, కన్నడ భాషల్లో దాదాపు 300 థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. విడుదలైన తొలి రోజు నుంచే హారర్, యాక్షన్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమాకు విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. ప్రముఖ సినీ వెబ్‌సైట్లలోనూ, ఎఓఆఎలోనూ మంచి రేటింగ్‌లు, పాజిటివ్ రివ్యూలు సొంతం చేసుకుంది.

టాలీవుడ్ సిల్వర్ స్క్రీన్‌పై హారర్, థ్రిల్లర్, యాక్షన్ అంశాలను వినూత్నంగా మిళితం చేస్తూ రూపొందిన ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, కృష్ణసాయి, రాగిణి ద్వివేది ప్రధాన పాత్రలు పోషించారు. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మించగా, క్రియేటివ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించారు. వరలక్ష్మి శరత్‌కుమార్ తన కెరీర్‌లోనే తొలిసారిగా చేసిన ఎంటర్‌టైన్‌మెంట్ ఈ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. దానికి తోడు నవీన్ చంద్ర యాక్టింగ్ కూడా ప్రేక్షకులను అలరిస్తుంది.

ఈ చిత్రంలో "చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ" అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌ను హారర్ థ్రిల్లర్ రూపంలో దర్శకుడు సంజీవ్ మేగోటి ఆవిష్కరించారు. హారర్, మిస్టరీ, యాక్షన్ అంశాలను సమతుల్యంగా మేళవిస్తూ ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా తీర్చిదిద్దారు. ముఖ్యంగా, సూపర్ స్టార్ కృష్ణకు నివాళిగా రూపొందించిన కృష్ణసాయి నటించిన ప్రత్యేక గీతం అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మూఢనమ్మకాల నేపథ్యంలో కర్మ సిద్ధాంతాన్ని థ్రిల్లింగ్ కథనంతో చూపించిన 'పోలీస్ కంప్లైంట్' హారర్, యాక్షన్, థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులకు థియేటర్లలో మంచి అనుభూతిని అందించింది. ఇప్పుడు అదే ఉత్కంఠభరిత అనుభవాన్ని జూలై 31 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో తెలుగు, కన్నడ భాషల్లో ఇంట్లోనే ఆస్వాదించే అవకాశం ప్రేక్షకులకు లభిస్తుంది.

## ది మేజ్" మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ 'నన్నే నన్నే..'రిలీజ్



తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ (శ్రీకాంత్) నటిస్తున్న కొత్త సినిమా "ది మేజ్". ఈ మూవీలో ప్రియాంక, హ్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యూఆర్ క్రియేషన్స్ బ్యానర్స్ పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. "ది మేజ్" చిత్రాన్ని సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది.

తాజాగా ఈ చిత్రం నుంచి హీరో ఆనంద్ దేవరకొండ చేతుల మీదుగా ఫస్ట్ సింగిల్ 'నన్నే నన్నే..' రిలీజ్ చేశారు. శ్రవణ్ భరద్వాజ్ బ్యూటిపుల్ గా కంపోజ్ చేసిన ఈ పాటకు విజయ్ కుమార్ ప్లెజెంట్ లిరిక్స్ అందించారు. కపిల్ కపిలన్ రిపీటెడ్ గా వినాలనిపించేలా పాడారు. నన్నే నన్నే పాట ఎలా ఉందో చూస్తే..'నా ప్రాణం నీవే, నా ధ్యానం నీవే, నా మౌన గానం ఇకపై నీవే, నా స్నేహం నీవే, నా మోహం నీవే, నా తీరని దాహం ఇకపై నీవే, నా లోకం నీవై మనసిచ్చావే, మాలోకం గాన్నే మహ మెచ్చావే, నా గుడి దేవతవై ఒకటయ్యావే, ఏడడుగుల ప్రేమే ప్రకటించావే,నన్నే నన్నే మనిషిగా గుర్తించావే, నన్నే నన్నే మార్చేశావే, మన్ను, మిన్ను కలిపేలా పైవాడే, నన్నూ నిన్నూ కలిపాడే..' అంటూ హీరోయిన్ పట్ల హీరో ప్రేమారాధన చూపిస్తూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

వాస్తవం?భ్రమ మధ్యనున్న సరిహద్దులను చెరిపేస్తూ, ప్రతి క్షణం మీ ఆలోచనలను సవాలు చేసే, జెయింట్ వీల్ ప్రయాణం లాంటి ఉత్కంఠభరితమైన సైకలాజికల్ థ్రిల్లర్ గా ఈ సినిమా రూపొందుతోంది.

నటీనటులు - శ్రీరామ్ (శ్రీకాంత్), ప్రియాంక, హ్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు, తదితరులు

## ఘనంగా 'నేను నా లల్లీ' మూవీ ఆడియో విడుదల



దర్శక-నిర్మాత, కథానాయకుడు ఎన్.ఎన్.ఆర్. చౌదరి నేతృత్వంలో రూపొందుతున్న సరికొత్త ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నేను నా లల్లీ'. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ కార్యాలయంలో సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా 'నేను నా లల్లీ' ఆడియో విడుదల జరిగింది. బిగ్ సీడీని లాంఛ్ చేసిన దర్శకుడు రాజవన్నెం రెడ్డి మాట్లాడుతూ.. నేను నా లల్లీ చిత్రం క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. పాటలు చాలా బావున్నాయి. ట్రైలర్ సినిమాపై ఆసక్తిని కలగజేసింది. హీరో ఎన్.ఎన్.ఆర్. చౌదరి ఈ సినిమా ద్వారా బాలయ్య బాబుని మరోసారి గుర్తు చేస్తారు. చక్కటి నటనతో ఫ్యామిలీ ఆడియన్స్ ని ఆకట్టుకోవడం ఖాయం. సినిమా యూనిట్ కి అభినందనలు అన్నారు.

నటుడు అదిరే అభి మాట్లాడుతూ.. సినిమా ట్రైలర్ చూశాను. అదిరిపోయింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంది. సినిమాను ప్రేక్షకులు ఆదరించి విజయాన్ని అందించాలని కోరారు.

విజన్ వి.వి.కె హౌసింగ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సీఎండి వి. విజయకుమార్ మాట్లాడుతూ.. 'నేను నా లల్లీ' క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. సినిమా చూసిన సెన్సార్ సభ్యులు ఎంతగానో ప్రశంసల వర్షం కురిపించారు. చిత్రం అందర్నీ అలరించే విధంగా రూపుదిద్దుకుంది. హీరో చౌదరి చక్కటి నటనతో అలరించి ప్రేక్షకుల మనసు దోచుకుంటారు. సినిమా తప్పకుండా మంచి విజయాన్ని అందుకుంటుందన్న గట్టి నమ్మకం నాకుంది. ఈ సినిమాకు ప్రేక్షకుల ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

వి. మహాలక్ష్మి మాట్లాడుతూ ..సినిమా ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే విధంగా తెరకెక్కింది. దర్శక-నిర్మాత, కథానాయకుడు ఎన్.ఎన్.ఆర్. చౌదరి నేతృత్వంలో రూపొందుతున్న సరికొత్త ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నేను నా లల్లీ' ఘన విజయాన్ని సాధించాలని యూనిట్ సభ్యులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

ఈ వేడుక అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఎదర్శక-నిర్మాత, కథానాయకుడు ఎన్.ఎన్.ఆర్. చౌదరి మాట్లాడుతూ.. ముందుగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా మిత్రులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సినిమాకు సెన్సార్ సభ్యుల నుంచి అద్భుతమైన స్పందన లభించిందని చౌదరి సంతోషం వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో ఎలాంటి అసభ్యకరమైన సన్నివేశాలు లేకుండా, ఇంత స్వచ్ఛంగా, నీట్‌గా వచ్చిన ఒక మంచి కుటుంబ కథా చిత్రం ఇదని, ఇలాంటి సినిమాలు రావడం చాలా అరుదని సెన్సార్ బోర్డు సభ్యులు అభినందించినట్లు ఆయన తెలిపారు. వారి ప్రశంసలు తమకు ఎంతో ఆనందాన్ని ఇవ్వడమే కాకుండా, బాధ్యతను కూడా పెంచాయని అన్నారు. ఈ చిత్రానికి ఒకేసారి దర్శకుడిగా, నిర్మాతగా, కథానాయకుడిగా బాధ్యతలు నిర్వహించడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని, ఒక దర్శకుడిగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఎంతో తృప్తిని ఇస్తోందని చెప్పారు. సినిమా ట్రైలర్ 1 మిలియన్ వ్యూస్ సాధించడం చాలా తృప్తినిచ్చిందని పేర్కొన్నారు. సినిమా ఇంత అద్భుతంగా రావడానికి 24 శాఖలకు చెందిన ప్రతి ఒక్కరి కృషి ఎంతో ఉందని చౌదరి కొనియాడారు. ముఖ్యంగా కో-డైరెక్టర్, డైలాగ్ రైటర్ శ్రీధర్, డీవోపీ శ్రీనివాసచారి, డ్యాన్స్ మాస్టర్ కపిల్, ఫైట్ మాస్టర్ తూఫాన్ మాస్టర్, ఎడిటర్ కృష్ణ, డబ్బింగ్ ఆర్టిస్ట్ రాజు, మిక్సింగ్ ఇంజనీర్ పద్మారావు, మేకప్ సాంబశివరావులతో పాటు అద్భుతమైన పాటలను అందించిన సంగీత దర్శకుడు ఎం.ఎల్. రాజా, ప్రాణం పోసే నేపథ్య సంగీతాన్ని అందించిన సీఎం ఆదిత్యలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి కుటుంబం కలిసి చూసి మెచ్చుకునేలా ఉండే ఈ 'నేను నా లల్లీ' చిత్రాన్ని అతి త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఎన్.ఎన్.ఆర్. చౌదరి ప్రకటించారు.

హీరోయిన్ తస్లీమ్ మాట్లాడుతూ.. ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాలో నటిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది అన్నారు.

ఈ చిత్రంలో హీరోగా ఎన్ఎన్ఆర్ చౌదరి, హీరోయిన్‌గా తస్లీమ్ నటించగా, సీనియర్ నటులు హేమసుందర్, పద్మ జయంతి, పద్మ రెడ్డి, గిరి తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు ఎడిటర్ - కృష్ణ. వి, సంగీతాన్ని ఎం.ఎస్. రాజా అందించారు. డీఓపీగా శ్రీనివాస చార్య, ఫైట్ మాస్టర్‌గా తుఫాన్, డ్యాన్స్ మాస్టర్ గా పిల్, ఆర్ట్ డైరెక్టర్ గా నాని పాండు పనిచేయగా, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ని పి.ఎస్. ఆదిత్య అందించారు. ఈ చిత్రానికి పీఆర్ఓ: బాబునాయక్ వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి స్టోరీ, స్క్రీన్ ప్లే, ప్రొడ్యూసర్ ఁ డైరెక్టర్ ఎన్.ఎన్.ఆర్. చౌదరి.

## ఐదు భాషల్లో 'రామాయణ: పార్ట్ 1' చిత్ర ట్రైలర్ విడుదల





నితీశ్ తివారి దర్శకత్వంలో, నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, ఎనిమిది అకాడమీ అవార్డులు (ఆస్కార్?) గెలుచుకున్న విజువల్ ఎఫెక్ట్స్ స్టూడియో డీఎన్ఈజీ (ఆఔఇఉ), యష్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ భాగస్వామ్యంతో నిర్మితమవుతున్న 'రామాయణ: పార్ట్ 1' ప్రపంచవ్యాప్తంగా దీపావళి 2026 సందర్భంగా విడుదల కానుంది. ఈ చిత్రాన్ని అంతర్జాతీయంగా సోనీ పిక్చర్స్, ఉత్తర భారతదేశంలో ధర్మ ప్రొడక్షన్స్ విడుదల చేయనున్నాయి.

ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'నమిత్ మల్హోత్రా రామాయణ: పార్ట్ 1' అఫీషియల్ ట్రైలర్‌ను చిత్ర బృందం ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసింది. జూలై 30 తెల్లవారుజామున విడుదలైన ఈ ట్రైలర్ హిందీ, కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చి ప్రపంచవ్యాప్తంగా అభిమానులను, సినీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

నమిత్ మల్హోత్రా 'రామాయణ' గురించి:

విజనరీ మేకర్ నమిత్ మల్హోత్రా నుంచి ప్రపంచంలోనే అత్యంత శాశ్వతమైన మహాకావ్యాల్లో ఒకటైన రామాయణం ఆధారంగా రూపొందుతున్న రెండు భాగాల భారీ సినీ ప్రయాణం 'రామాయణ: పార్ట్ 1' ప్రేక్షకుల ముందుకు రానుంది.

సృష్టి ఆరంభం నుంచి త్రిమూర్తులు మూడు లోకాలను పాలిస్తున్నారు. సృష్టికర్త బ్రహ్మ, రక్షకుడు విష్ణు, పరివర్తనకు ప్రతీక అయిన శివుడు విశ్వాన్ని నడిపిస్తుంటారు. స్వర్గం, భూమి అశాంతి వైపు సాగుతున్న సమయంలో సమతుల్యతను పునరుద్ధరించేందుకు విష్ణుమూర్తి అవతారమెత్తి భూమిపైకి దిగివస్తాడు. ఈసారి ఆయన శ్రీరాముడు (రణ్‌బీర్ కపూర్)గా జన్మిస్తాడు. మరోవైపు త్రిమూర్తుల వరాలతో అజేయుడు, అమరుడు, అపార జ్ఞానవంతుడు, అత్యంత శక్తిమంతుడైన రాక్షసరాజు రావణుడు (యశ్) అహంకారం, ప్రతీకారంతో విశ్వాన్నే కుదిపేసే శక్తిగా నిలుస్తాడు.

రావణుడిని ఎదుర్కొనేందుకు విధి నిర్ణయించిన వ్యక్తి తానేనని తెలియని శ్రీరాముడు, ధర్మానికి ప్రతీకగా, అయోధ్య యువరాజుగా అందరి ప్రేమాభిమానాలను పొందుతాడు. తన ప్రియమైన భార్య సీత (సాయి పల్లవి), నమ్మకమైన సోదరుడు లక్ష్మణుడు (రవీ దూబే)తో ప్రశాంతమైన జీవితం గడపాలని భావిస్తాడు. అయితే విధి అతన్ని వనవాసానికి నడిపిస్తుంది. ఆ ప్రయాణం చివరికి రావణుడితో దేవతల, మానవుల భవిష్యత్తునే నిర్ణయించే మహా సంగ్రామానికి దారి తీస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించిన కథలను తెరకెక్కించిన దర్శకుడు నితీశ్ తివారి, భారతీయ భావోద్వేగాలు, సంస్కృతిని కాపాడుతూ 'దంగల్' వంటి చిత్రాలతో చైనా సహా పలు దేశాల్లో బాక్సాఫీస్ రికార్డులు సృష్టించారు. అలాంటి దర్శకుడితో పాటు భారతీయ సినీ పరిశ్రమలోని పలు తరాల అత్యుత్తమ నటీనటులు ఈ చిత్రంలో భాగమయ్యారు. తరతరాల భారతీయుల మనసుల్లో శ్రీరాముడిగా చిరస్థాయిగా నిలిచిన అరుణ్ గోవిల్, ఈ చిత్రంలో శ్రీరాముడి తండ్రి దశరథ మహారాజు పాత్రలో కనిపించనున్నారు. దిగ్గజ నటి శోభన కైకేసి పాత్రలో నటిస్తుండగా, అజింక్య దేవ్ విశ్వామిత్ర మహర్షిగా, కునాల్ కపూర్ ఇంద్రుడిగా, రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖగా, రవీ దూబే లక్ష్మణుడిగా కనిపించనున్నారు.

ఈ అద్భుతమైన తారాగణానికి నాయకత్వం వహిస్తున్న సూపర్ స్టార్ రణ్‌బీర్ కపూర్, తరతరాలుగా భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఆరాధించే, ధర్మానికి శాశ్వత ప్రతీక అయిన శ్రీరాముడి పాత్రలో నటిస్తున్నారు. సాయి పల్లవి చరిత్రలో అత్యంత ఆరాధనీయమైన మహిళల్లో ఒకరైన మాత సీత పాత్రలో తన హుందాతనం, ఆత్మబలం, కరుణను ఆవిష్కరించనున్నారు. పాన్ ఇండియా సూపర్ స్టార్ రాకింగ్ స్టార్ యశ్, తన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ ద్వారా ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించడమే కాకుండా, భారతీయ ఇతిహాసాల్లో అత్యంత శక్తిమంతమైన, అజేయమైన ప్రతినాయకుల్లో ఒకరైన రావణుడు పాత్రను పోషిస్తున్నారు.

అవార్డు గ్రహీత అయిన స్క్రీన్ రైటర్ శ్రీధర్ రాఘవన్ అనుసరణలో రూపొందిన రామాయణం, ఆస్కార్ విజేతలైన హాన్స్ జిమ్మర్, ఏ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ అసాధారణ తారాగణం, ప్రపంచవ్యాప్తంగా పేరొందిన దర్శకులు, కళాకారులు, సాంకేతిక నిపుణులు, నైపుణ్యం కలిగిన క్రియేటర్స్ తో భారతీయ ప్రతిభను ఒకే వేదికపైకి తీసుకురావాలన్న నిర్మాత నమిత్ మల్హోత్రా దృష్టికి నిదర్శనం. మానవాళి చరిత్రలో అత్యంత ప్రాచీనమైన, శాశ్వతమైన కథల్లో ఒకటైన రామాయణాన్ని, ఇంతవరకు ఎప్పుడూ ప్రయత్నించని స్థాయి, ప్రామాణికత, సినీ వైభవంతో ప్రపంచ ప్రేక్షకులకు అందించాలనే సంకల్పంతో ఈ చిత్రం రూపొందుతోంది.

నిర్మాత, 'రామాయణ' క్రియేటివ్ ఆర్కిటెక్ట్ నమిత్ మల్హోత్రా మాట్లాడుతూ...

"రామాయణం మన గొప్ప మహాకావ్యాల్లో ఒకటి మాత్రమే కాదు. అది మన జీవన విధానంలో భాగం. మనం ఎలా జీవిస్తామో, ఎలా సంబరాలు చేసుకుంటామో, మన విలువలను ఒక తరం నుంచి మరో తరానికి ఎలా అందిస్తామో దాంట్లో రామాయణం భాగస్వామిగా ఉంటుంది. ప్రతి ఏడాది దసరా, దీపావళి వెలుగు చీకటిపై, ధర్మం అధర్మంపై సాధించిన విజయాన్ని మనకు గుర్తు చేస్తాయి. వేల సంవత్సరాల క్రితం చెప్పబడిన కథ నేటికీ కోట్లాది మంది దైనందిన జీవితాలను ప్రభావితం చేయడం చాలా అరుదు. అలాంటి కథే రామాయణం.

ప్రపంచ సినీ పరిశ్రమలో నా జీవితంలో చాలా కాలం గడిపిన తర్వాత, భారతదేశంలోని గొప్ప కథలు ప్రపంచంలోనే అత్యంత పెద్ద వేదికపై నిలవాలని నేను ఎప్పుడూ నమ్మాను. ఈ రోజు ఆ స్థాయిలో వాటిని ఆవిష్కరించడానికి అవసరమైన కళాకారులు, సాంకేతికత, నైపుణ్యం, సంకల్పం మనకు ఉన్నాయి. ఈ అద్భుతమైన సాంస్కృతిక వారసత్వాన్ని అది ప్రామాణికత, స్థాయి, సినీ వైభవంతో ప్రపంచ ప్రేక్షకులకు అందించే సమయం వచ్చింది.

ఇది కేవలం ఒక సినిమా ప్రారంభం మాత్రమే కాదు. భారతదేశ సాంస్కృతిక సంపదను ప్రపంచంతో పంచుకునే ఒక మహా ప్రయాణానికి ఇది నాంది. భారతదేశం ఈ కథను ఎప్పటినుంచో జీవిస్తోంది. ఇప్పుడు దాన్ని ప్రపంచంతో పంచుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నాం."

దర్శకుడు నితీశ్ తివారి మాట్లాడుతూ...

"రామాయణం ఇప్పటివరకు చెప్పబడిన గొప్ప కథల్లో ఒకటి. దానికి కారణం దాని వైభవం కాదు, అది ప్రతిబింబించే శాశ్వతమైన విలువలు. దర్శకుడిగా దానిని ప్రపంచవ్యాప్త కథగా మార్చాల్సిన బాధ్యత నాకు ఎప్పుడూ అనిపించలేదు. అది ఇప్పటికే విశ్వవ్యాప్తమైన కథ. నా బాధ్యత దానిని సంపూర్ణ నిజాయితీతో, ప్రామాణికతతో, అత్యంత గౌరవంతో తెరకెక్కించడమే.

రచన నుంచి నటన వరకు, ప్రొడక్షన్ డిజైన్, సంగీతం, విజువల్ ఎఫెక్ట్స్, తెరపై కనిపించే ప్రతి ఫ్రేమ్ వరకు తీసుకున్న ప్రతి సృజనాత్మక నిర్ణయం ఒకే ఆలోచనతో జరిగింది. ఈ అసాధారణ వారసత్వాన్ని అది అర్హమైన గౌరవంతో నిలబెట్టడంతో పాటు అత్యుత్తమ సినీ నైపుణ్యంతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనేదే మా లక్ష్యం.

ప్రపంచంలోని అత్యుత్తమ కళాకారులు, సాంకేతిక నిపుణులు, కథకులతో కలిసి ఈ విజన్‌కు రూపం ఇవ్వడం నా జీవితంలో దక్కిన గొప్ప అదృష్టం. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు 'రామాయణం'లో కేవలం విజువల్ స్పెక్టాకిల్‌ను మాత్రమే కాకుండా, వేల సంవత్సరాలుగా నిలిచిన భావోద్వేగం, మానవత్వం, శాశ్వత స్ఫూర్తిని కూడా అనుభవిస్తారని ఆశిస్తున్నాను."

డీఎన్ఈజీ (ఆఔఇఉ) గురించి

డీఎన్ఈజీ (ఆఔఇఉ) ప్రపంచంలోనే అగ్రగామి విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ సంస్థల్లో ఒకటి. సినిమాలు, టెలివిజన్, ఇమర్సివ్ కంటెంట్ సృష్టిలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ సంస్థకు ఉత్తర అమెరికా, యూరప్, ఆసియా, ఆస్ట్రేలియాలో కార్యాలయాలు, స్టూడియోలు ఉన్నాయి. దాదాపు 30 ఏళ్ల అనుభవం కలిగిన డీఎన్ఈజీ, 2011 నుంచి ఇప్పటివరకు 'విజువల్ ఎఫెక్ట్స్' విభాగంలో ఎనిమిది అకాడమీ అవార్డులు (ఆస్కార్?) గెలుచుకోవడంతో పాటు, తన అద్భుతమైన పనితీరుకు గాను అనేక బాఫ్టా, ప్రైమ్‌టైమ్ ఎమ్మీ?, విజువల్ ఎఫెక్ట్స్ సొసైటీ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సంస్థ రానున్న ప్రాజెక్టుల్లో 'కయోటీ వర్సెస్ అక్మీ' (ఆగస్టు 2026), 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' (ఆగస్టు 2026), 'క్లారా అండ్ ది సన్' (అక్టోబర్ 2026), 'స్ట్రీట్ ఫైటర్' (అక్టోబర్ 2026), 'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్: ది రింగ్స్ ఆఫ్ పవర్ - సీజన్ 3' (నవంబర్ 2026), 'ది క్యాట్ ఇన్ ది హ్యాట్' (నవంబర్ 2026), 'రామాయణ: పార్ట్ 1' (నవంబర్ 2026), 'బ్లేడ్ రన్నర్ 2099' (నవంబర్ 2026), 'లూనీ ట్యూన్స్: డాఫీ సీజన్' (నవంబర్ 2026), 'ది ఆంగ్రీ బర్డ్స్ మూవీ 3' (డిసెంబర్ 2026), 'అబవ్ ది బిలో' (డిసెంబర్ 2026), 'యానిమల్ ఫ్రెండ్స్' (జనవరి 2027), 'బ్యాడ్ ఫెయిరీస్' (మే 2027), 'మార్జీ క్లాస్' (నవంబర్ 2027), అలాగే 'అలోన్ ఎట్ డాన్', 'ఎస్ఏఎస్: రోగ్ హీరోస్ సీజన్ 3', 'ఆన్ ది లైన్', 'రోడ్ హౌస్ 2', 'స్నూపీ అన్‌లీష్డ్', 'బ్లడ్ ఆన్ స్నో', 'దిస్ సిటీ ఈజ్ అవర్స్ సీజన్ 2', 'బ్లాక్ ప్యాలెస్', 'గండామ్' ఉన్నాయి.

ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ గురించి

దర్శకుడు, నిర్మాత నమిత్ మల్హోత్రా స్థాపించిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని సినిమాలు, టెలివిజన్, గేమింగ్ రంగాల్లో వినూత్నమైన, ఆకట్టుకునే కంటెంట్‌ను ఫైనాన్స్ చేసి నిర్మిస్తోంది. ఇటీవల సోనీ పిక్చర్స్ కోసం అల్కాన్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి నిర్మించిన యానిమేటెడ్ చిత్రం 'ది గార్‌ఫీల్డ్ మూవీ' ప్రపంచవ్యాప్తంగా 257 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు సాధించింది. ప్రస్తుతం లెజెండరీ ఎంటర్‌టైన్‌మెంట్, ర్యాన్ రెనాల్డ్స్ నిర్మాణ సంస్థ మ్యాక్సిమమ్ ఎఫర్ట్‌తో కలిసి 'యానిమల్ ఫ్రెండ్స్' లైవ్-యాక్షన్/యానిమేషన్ హైబ్రిడ్ చిత్రాన్ని, అలాగే రోవియో ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్, సేగా, ఫ్లైవీల్ మీడియా, వన్ కూల్ గ్రూప్, డెంట్సు భాగస్వామ్యంతో పారామౌంట్ పిక్చర్స్ కోసం ×'ది ఆంగ్రీ బర్డ్స్ మూవీ 3'ను నిర్మిస్తోంది. అలాగే, 5,000 సంవత్సరాల చరిత్ర కలిగిన భారతీయ మహాకావ్యం ఆధారంగా రూపొందుతున్న రెండు భాగాల భారీ చిత్రం ×'రామాయణ'××ను కూడా నిర్మిస్తోంది. ప్రపంచ ప్రేక్షకులకు ఈ మహాకావ్యాన్ని ఇంతకు ముందెన్నడూ చూడని సినీ వైభవంతో అందించడంతో పాటు, విస్తృతమైన ట్రాన్స్‌మీడియా యూనివర్స్‌కు శ్రీకారం చుట్టే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది.

మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ గురించి

రాకింగ్ స్టార్ యశ్ స్థాపించిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ స్వతంత్ర నిర్మాణ సంస్థ. సృజనాత్మక ప్రతిభను ప్రోత్సహించడం, సినీ కథనాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లే వినూత్నమైన కంటెంట్‌ను అందించడం ఈ సంస్థ లక్ష్యం.

ప్రస్తుతం కేవీఎన్ ప్రొడక్షన్స్‌తో కలిసి 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్', అలాగే ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్తో కలిసి 'రామాయణ' వంటి రెండు ప్రతిష్టాత్మక చిత్రాలకు ఈ సంస్థ సహ నిర్మాతగా వ్యవహరిస్తోంది.

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844